తండ్రిని చంపిన తనయుడు

లారీ డ్రైవర్‌కు ఏడేళ్ల జైలు ■ లోపలి పేజీలో..

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శనివారం 17 మే 2025

• భారత్ మాతాకి జై ■ లోపలి పేజీలో..



పాక్ ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరిట చేపట్టిన దాడి విజయవంతం కావడంతో గణపవరంలో కూటమి నేతలు 500 అడుగుల జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు తదితరులు భారత్ మాతాకీ జై అంటూ నినదించారు.

లక్ష్మీనరసింహస్వామికి 30 ఎకరాల భూహక్కు పత్రాల అందజేత ■ లోపలి పేజీలో..

కాలువలు.. కన్నీళ్లు



- ఏటా వీటికి నిర్వహణ భారమే
- జగన్ జమానాలో లాకులు, కాలువలు సర్వనాశనం
- రైతులు మొత్తుకున్నా కనికరించని సర్కార్
- పూర్తిస్థాయి నీరందించలేని దుస్థితి
- ఎక్కడికక్కడ కుంగిన కాలువ గట్లు
- దుర్గంధానికి తోడు భారీగా పూడికలు
- ఆధునికీకరణ ఎప్పుడో బుట్టదాఖలు
- కూటమి సర్కార్‌లో కదలిక.. నిధులు విడుదల
- కాలువ గట్ల సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలన

ఆంధ్రజ్యోతి పరిశీలన

గత జగన్ సర్కార్ కాల్వలను నిర్వీర్యం చేసింది. సాగు నీటి పారుదలను సముద్రంలో కలిపేసింది. అత్యంత కీలకమైన లాకులను గాలికి వదిలేసింది. ఇవి ఇప్పటికే శిథిలమయ్యాయి. పెదపాడు మండలం కలపర్రు - గోగులపాడు వద్ద కృష్ణా కాలువపై షట్టర్లు, ఉంగుటూరు మండలం కాగుపాడు వద్ద ఉన్న రెగ్యులేటర్ ఇలా అధ్వానంగా ఉన్నాయి. కూటమి సర్కార్ రాకతో ఇప్పుడు వీటికి మోక్షం కలగనుంది. లాకుల నిర్వహణపై ఆంధ్రజ్యోతి బృందం పరిశీలన.. ■ లోపలి పేజీలో..



స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

» కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతంగా నిర్వహించి మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం జిల్లా పంచాయతీ శాఖాధికారి, జడ్పీ సీఈవో, ఆయా మండల అధికారులు, ఆయా పుర పాలక సంఘాల కమిషనర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నూటికి నూరుశాతం ప్రగతి సాధించిన పంచాయతీలు, వార్డులు, నగర పాలక సంస్థల డివిజన్ గుర్తించి వారికి సన్మాన అభినందన కార్య క్రమాలు చేపట్టాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. డీపీవో అనూరాధ, జడ్పీ సీఈవో భీమేశ్వర్, కమిషనర్లు, డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, డీఎల్‌డీవోలు, ఈవోఆర్డీలు పాల్గొన్నారు.

● జిల్లాలో శిథిలావస్థలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల భవనాల ప్రస్తుత పరిస్థితి, జరుగుతున్న పనులపై కలెక్టర్ వెట్రిసెల్వి సంక్షేమ అధికారులు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, పబ్లిక్ హెల్త్, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్లతో శుక్రవారం సమీక్షించారు.

అరగంట ముందే గేట్ క్లోజ్

» రేపు ఏలూరులోని రెండు కేంద్రాల్లో జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షకు ఏర్పాట్లు

ఏలూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా వున్న 23 ఐఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 18న నిర్వహించనున్న జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పాటించాల్సిన మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి షిఫ్టులో జరిగే పేపర్-1 పరీక్షకు 8.30 గంటల కంటే ముందుగా, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో షిఫ్టులో జరిగే పేపర్-2 పరీక్షకు మధ్యాహ్నం 2గంటల కంటే ముందుగా సంబంధిత పరీక్ష కేంద్రాల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. అడ్మిట్ కార్డుతో పాటు వాలీడ్ ఒరిజినల్ ఫొటో గుర్తింపు (ఆధార్/ఓటరు ఐడీ/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్టు/పాన్ కార్డు/కళాశాల ప్రిన్సిపాల్ జారీచేసిన ఐడీ/నోటరైజ్డ్ సర్టిఫికెట్) ధ్రువపత్రాన్ని తప్పనిసరిగా తీసుకెళ్లాలి. పెన్ లేదా పెన్సిల్‌తో పాటు పారదర్శకంగా వున్న వాటర్ బాటిల్‌ను అభ్యర్థులు తమవెంట తీసుకెళ్లేందుకు అనుమతిస్తారు. సాధారణ ఫార్మల్ దుస్తులను మాత్రమే అభ్యర్థులు ధరించాలన్నారు. జిల్లాలో ఈ పరీక్షకు ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి 180 మంది, సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలు కేంద్రానికి 144 మంది అభ్యర్థులను కేటాయించారు.

సమగ్రశిక్ష రాష్ట్ర అసిస్టెంట్ జీసీడీవోగా సబీహా సుల్తానా

సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ జీసీడీవో(బాలికాభివృద్ధి అధికారి)గా సబీహా సుల్తానా డిప్యూటేషన్‌పై నియమితులయ్యారు. ప్రస్తుతం ఈమె పెదపాడు మండలం అప్పనవీడు జడ్పీ హైస్కూలులో స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ కార్యాలయంలో కొన్నేళ్లపాటు జిల్లాస్థాయి జీసీడీవోగా, అసిస్టెంట్ ఏఎంవో (ఉర్దూ)గా విధులు నిర్వర్తించారు. కుక్కునూరు, వేలేరుపాడు, వేలేరులలోని కేజీబీవీల పర్యవేక్షణ చేశారు. అమరావతిలోని ఎస్ఎస్ఏ ఎస్‌పీడీ కార్యాలయంలో విధుల్లో చేరేలా సబీహాను స్కూలు నుంచి రిలీవ్‌చేయాల్సిందిగా అప్పనవీడు జడ్పీ హెచ్ఎస్ హెచ్ఎంను డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన భౌతికశాస్త్రం, అర్థికశాస్త్రం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఆర్ఐవో యోహాన్ తెలిపారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు 3,950 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,652 మంది, మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 866 మందికి 793 మంది హాజరయ్యారన్నారు.

కదలిక



తల్లికి వందనం, అన్నదాత సుఖీభవకు కసరత్తు

- తెలుగుదేశం ప్రభుత్వంలో వేగంగా నిర్ణయాలు
- లబ్ధిదారులకు వచ్చేనెల అత్యంత కీలకం
- రేషన్‌కార్డుల తప్పు ఒప్పుల సవరణలకు వెసులుబాటు
- కొత్తగా 4 వేలమంది వితంతువులకు పింఛన్లు

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికి దగ్గర కావస్తోంది. జగన్ జమానాలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. ఈ ఏడాదిగా తెలుగుదేశం ప్రభుత్వం ఒక్కొక్కటిగా వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తూ ఉంది. జిల్లా వ్యాప్తంగా నడవడానికి వీలులేని రహదారులను ఇప్పటికే మరమ్మతులు చేశారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాల అమలుపై కసరత్తు చేస్తోంది. రేషన్ కార్డుల్లో సవరణలకు, మార్పులు చేర్పులకు శ్రీకారం చుట్టిం ది. వితంతువులకు చేయూత నిచ్చేలా వచ్చే నెలలోనే కొత్త వారికి పింఛన్లు ఇవ్వాలని సంకల్పించారు. ప్రభుత్వ పథకాలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కాస్త కదలిక వచ్చింది.

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల హామీలు నిలబెట్టుకునేందుకు వివిధ విభాగాల్లో రంగం సిద్ధం చేస్తోంది. ప్రతీది ఆర్థికంగా ముడిపడి ఉండడంతో సాధ్యమైనంత మేర ఖజానాను నింపే దారి లేక తడబాటు పడ్డారు. కానీ ఎక్కడ లోపం ఉందో దానిని సవరించేందుకు ప్రయత్నాలు సాగాయి. ప్రత్యేకించి జిల్లాల వారీగా అభివృద్ధి కార్యక్రమాలే కాక సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే చెబుతూ వచ్చారు. ఇప్పుడు ఆ మాట అక్షరాల నిజం చేసేలా ప్రణాళికాలు సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేకించి వ్యవసాయ ఆధార జిల్లా అయిన ఏలూరులో రైతులకు సాయపడే దిశగా ముమ్మర ప్రయత్నాలు ఆరంభమయ్యాయి.

గత ప్రభుత్వ హయాంలో రైతులకు ఆర్థిక సాయం అందించేందుకు రైతు భరోసా పేరిట రైతుల ఖాతాల్లోకి నిధులు జమ చేసేవారు. తొలుత లక్షా తొంబ్భై ఏడు వేల నుంచి రైతు లబ్ధిదారుల సంఖ్య నాలుగేళ్ల పాటు క్రమేపీ పెరుగుతూ వచ్చింది. ఏడాదికి రూ.15 వేలు చొప్పున సాయమందించారు. జగన్ సర్కారు ముగిసే నాటికి ఏలూరు జిల్లా వ్యాప్తంగా 2,35,847 రైతులకు సుమారు రూ.18.38 కోట్లు చెల్లించగలిగారు. తెలుగుదేశం ప్రభుత్వం అప్పట్లో రైతు భరోసాలో తమకు చోటు కల్పించలేదంటూ అనేకమంది కలెక్టర్ దగ్గర నుంచి ఇతర అధికారులకు ఫిర్యాదులు చేస్తూనే వచ్చారు. కొంత పార్టీ పక్షపాత దిశగా అప్పటి ప్రభుత్వం వ్యవహరించడంతో చాలామంది రైతు కుటుంబాలు భరోసాను పొందలేకపోయాయి. తెలుగుదేశం ప్రభుత్వం అధికార పగ్గాల చేపట్టిన తర్వాత ఏ పథకమైనా అర్హులైన లబ్ధిదారులకే అనే నినాదంతో ముందుకెళుతోంది. అప్పటి రైతు భరోసా పథకాన్ని మార్చి అన్నదాత సుఖీభవగా కొత్త పేరును అమల్లో పెట్టారు. జూన్‌లో ఖరీఫ్ పనులు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో రైతులకు ఆర్థికంగా ఊతమిచ్చేందుకు సుఖీభవ కింద పూర్తి కసరత్తు చేయడమే కాకుండా లోపాలు తలెత్తకుండా, విమర్శలకు తావులేకుండా రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే వ్యవసాయశాఖ ఈ దిశగానే కసరత్తుల్లో తలమునకలై ఉంది. ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు అనువుగా బ్యాంకర్లు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.13,500 మాత్రమే రైతులకు అందించగా తాజాగా అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు అందించబోతున్నారు. ఈ మొత్తాన్ని ఏడాదికి ఎన్ని విడతల్లో అందిస్తారో మార్గదర్శకాలు వెలువడనున్నాయి.

● అమ్మకు వందనం రెడీ.. జూన్ వచ్చిందంటే చాలు పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి. తల్లిదండ్రులకు కాళ్లు చేతుల్లో వణుకు. విద్యార్థుల యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, ఇతరత్రా ఫీజులకు అయ్యే సొమ్ముల కోసం వెంపర్లాట. అదే అల్ప ఆదాయ వర్గాల్లో ఇది తీరని బెంగ. గడచిన ప్రభుత్వంలో విద్యార్థుల సంక్షేమం నిమిత్తం అమ్మ ఒడి ప్రవేశ పెట్టారు. ఏలూరు జిల్లాలోనే అమ్మఒడి పథకం కింద 1,78,214 మంది లబ్ధిదారులకు నాలుగేళ్లలో రూ.1069 కోట్లు అప్పట్లో అందించారు. అయితే ఇస్తామన్న మొత్తం సొమ్ముల్లో స్వీపర్ మెయింటెనెన్స్ ఛార్జీల పేరిట రూ.2 వేలు పక్కన పెట్టించారు. అప్పట్లో తల్లులందరికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పి కేవలం రూ.13 వేలతోనే సరిపెట్టడం విశేషం. తెలుగుదేశం ప్రభుత్వం ఇప్పుడు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. కుటుంబంలో ఎంతమంది చదువుకునేవారు ఉంటే రూ.15 వేలు చొప్పున అందరికీ చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు దానిని నిలబెట్టుకునే ప్రయత్నాల్లో ఉంది. జగన్ ప్రభుత్వంలో వచ్చిన లబ్ధిదారుల సంఖ్య కంటే టీడీపీ ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారుల సంఖ్య మూడింతలు పెరిగే అవకాశం ఉంది. సాధ్యమైన మేర పాఠ శాలలు తెరిచే నాటికే ఇంటిల్లిపాదీ మెచ్చేలా తల్లికి వందనం వేయబోతున్నారు. విద్యాశాఖ ఈ దిశగా వేగంగా కసరత్తు చేస్తోంది.

రేషన్ కష్టాలకు చెక్

ఇంతకుముందు వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్‌కార్డు కావాలన్నా, సవరించాలన్నా ఏదైనా వలంటీర్ల చేతిలోనే ఉండేది. అనర్హులకు సైతం అప్పట్లో తెలుపురంగు రేషన్‌కార్డులు సొంతమయ్యాయి. కొత్తగా పెళ్లి అయిన జంటలకు విడిగా రేషన్‌కార్డులు ఇవ్వాలన్నా అచితూచి వ్యవహరించేవారు. జిల్లా వ్యాప్తంగా 6లక్షల 25 వేలకు పైగానే రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటన్నింటిని సవరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చింది. ఫలితంగా రేషన్‌కార్డులు ఎవ్వరిని తొలగించాలన్నా కొత్త చేర్పాలన్నా మార్గదర్శకాలు సులభతరం చేసింది. అయినప్పటికి ఈ ప్రక్రియ యావత్తు గురువారం నుంచే అమల్లోకి రాగా ఆదిలోనే సర్వర్ కష్టాలు ఎదురవుతున్నాయి. మార్పులు చేర్పులకు తడబాటు మొదలైంది. జూన్ ఒకటో తేదీ నుంచి గతంలో వున్న పాత రేషన్‌కార్డుల స్థానంలో కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని ఇప్పటికే పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. సాధ్యమైనంత మేర ఆలోపే మార్పులు చేయాలని ఒక్కసారిగా ప్రజల్లో కదలిక రావడంతో ఆ ప్రభావం కాస్త సర్వర్లపై ఒత్తిడిని పెంచింది. దీనికి తోడు సచివాలయ సిబ్బంది చొరవ తీసుకోవాల్సి ఉంది. దీనికి తోడు వచ్చే నెలలో రాష్ట్రంలో లక్ష మంది వితంతు కొత్తగా పింఛన్లు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా 67 వేలమంది వితంతువులు ఉండగా ఇప్పుడు కొత్తగా మరో నాలుగు వేల మందిని ఈ జాబితాలో చేర్చను న్నారు. వచ్చే నెల నుంచి జిల్లాల వారీగా కొత్త వితంతువు లను గుర్తించి వారికి పింఛను ఇవ్వాలన్నా సంకల్పం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

హెచ్ఎం, ఇద్దరు టీచర్లకు షోకాజ్ నోటీసులు

» 'పది' రెమిడియల్ క్లాసులకు విద్యార్థుల గైర్హాజరు ఫలితం

ఏలూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు ఫెయిలైన విద్యార్థులను అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సంసిద్ధులుగా చేసేందుకు అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న రెమిడియల్ క్లాసులకు విద్యార్థులు హాజరయ్యేలా శ్రద్ధ తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తుండడంపై జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. గురువారం ఏలూరులోని సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూలులో నిర్వహిస్తున్న రెమిడియల్ క్లాసులను ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్ వెట్రిసెల్వి అక్కడి స్కూలులో ప్రత్యేక తరగతులకు విద్యార్థులు పెద్దసంఖ్యలో గైర్హాజరు కావడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో స్కూలు హెచ్ఎం, మరో ఇద్దరు సైన్సు టీచర్లకు డీఈవో వెంకటలక్ష్మమ్మ షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఈ విషయాన్ని విద్యాశాఖ వర్గాలు ధ్రువీకరించాయి. ఇక్కడి స్కూలులో రెమిడియల్ క్లాసులకు 51 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా కలెక్టర్ ఆకస్మిక సందర్శనలో కేవలం 17 మంది మాత్రమే ఉన్నట్టు నిర్ధారించుకున్నారు. దీంతో హెచ్ఎంను, టీచర్లను ఆరా తీయడంతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్‌లో నేరుగా కలెక్టర్ మాట్లాడారు. రెమిడియల్ క్లాసులకు విద్యార్థులను ఎందుకు పంపడం లేదని పేరెంట్స్‌ను ప్రశ్నిస్తూనే, ప్రత్యేక తరగతులకు విద్యార్థులను తీసుకురావడంలో ఎందుకు విఫలమయ్యారని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఈ క్రమంలోనే హెచ్ఎంకు, ఇద్దరు టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, మూడురోజుల్లోగా వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించినట్టు కార్యాలయ వర్గాలు తెలిపాయి. కాగా మరో మూడురోజుల్లోనే (ఈ నెల 19 నుంచి) టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.



తెల్లవారుజామున నీటమునిగిన ఆర్ఆర్‌పేటకు వెళ్లే రోడ్డు





కాలువలను తలపిస్తున్న సుభాష్ చంద్రబోస్ బొమ్మ సెంటర్ రోడ్డు, పవర్‌పేట రోడ్డు

వీడని వాన

ఏలూరు సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ మార్పులు, బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఏలూరులో గురువారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కుండపోత వర్షం కురిసింది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు నీట మునిగాయి. శనివారం నుంచి జిల్లాలో మరి కొన్నిరోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ చెబుతోంది. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా ముదినేపల్లి మండలంలో 88.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 16.8 మి.మీగా నమోదైంది. పెదపాడు మండలంలో 79.4, కలిదిండి మండలంలో 50.8, ఏలూరు అర్బన్ 42.6, చాట్రాయి 42.2, నూజివీడు 28.8, ఆగిరిపల్లి 26.6, ఏలూరు రూరల్ మండలం 17.8, భీమడోలు 15.4, పెదవేగి 14.4, దెందులూరు 14.2, టి.నరసాపురం 14.2, నిడమర్రు 9.2, చింతలపూడి 8.4, ద్వారకా తిరుమల 7.4, ముసునూరు 6.8, మండవల్లి 3.2, కైకలూరు 0.8, లింగపాలెం 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఆడుదాం ఆంధ్ర పోటీలపై విజిలెన్స్ విచారణ

ఏలూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్)లో జరిగిన అవకతవకలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. రూ.130 కోట్లు ఖర్చు చేసి చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర'తో పాటు ఇతర కార్యక్రమాలకు సంబంధించి చేసిన వ్యయంపైనా ఆరా తీస్తోంది. ఇందులో భాగంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఏలూరు ఎంపీడీవో కార్యాలయం, ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి సచివాలయంలో ఆడుదాం ఆంధ్ర పోటీల్లో మండల స్థాయిలో చేసిన చెల్లింపులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు భోజన సదుపాయాలు తదితర అంశాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ క్రీడా పోటీలు ఏలూరు జిల్లాలోను జరిగాయి. ఇదే సమయంలో సచివాలయ పరిధిలో ఔత్సాహిక క్రీడాకారులను ఎంపిక చేసి క్రీడా పరికరాలతో కూడిన కిట్లను వారికి పంపిణీ చేశారు. ఆ పరికరాలు జిల్లా క్రీడాభివృద్ధి శాఖకు అందించగా వాటిని గ్రామ, వార్డు, పట్టణ, వార్డు సచివాలయాల్లో పంపిణీ చేశారు. ఈ కిట్‌లో క్రికెట్ బ్యాట్, చేతులకు, కాళ్లకు ధరించే రక్షణ పరికరాలు, టెన్నిస్ ర్యాకెట్‌లు, కప్‌లు ఇలా ఏడు రకాల క్రీడలకు సంబంధించిన పరికరాలను పంపిణీ చేశారు. అయితే వీటిలో ఎక్కువగా ఆకర్షించినవి క్రికెట్ బ్యాట్లు. ఎక్కువ మంది క్రీడాకారులకు ఈ కిట్లు పంపిణీ చేశారు. అయితే తొలిరోజే ఈ బ్యాట్లు తొలి మ్యాచ్‌లోనే విరిగిపోవడం సంచలనం కలిగించింది. క్రీడాకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ విరిగిపోయిన బ్యాట్లను ఫొటోలు తీసి సోషల్ మీడియాలో అప్పట్లో వైరల్ చేశారు. ఇదిలా ఉండగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించిన కిట్లు తయారీని రాష్ట్రానికి చెందిన ఒక సంస్థకు టెండర్‌ను కట్టబెట్టారు. అయితే అప్పట్లోనే ఈ సంస్థపై విమర్శలు వచ్చాయి. అయినప్పటికీ శాప్ ఆ కంపెనీకే టెండర్ ఇచ్చేసింది. కోట్లు రూపాయల విలువైన క్రీడా పరికరాలు కొనుగోలులోను అవినీతి జరిగినట్టు కూటమి ప్రభుత్వం గుర్తించింది. క్రీడాకారులకు అందించే ట్రోఫీలు, భోజన సదుపాయం ఇతర అంశాల్లోను అవినీతి జరిగిందని గుర్తించింది. ఈ క్రమంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ ప్రారంభించారు.



విరిగిన క్రికెట్ బ్యాట్‌లు (ఫైల్)

కాలువలు.. కన్నీళ్లు..

ఆంధ్రజ్యోతి పరిశీలన

దశాబ్దాల కాలం నాటి కాలువల లాకులు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా మరమ్మతులు. గడిచిన ఐదేళ్ల జగన్ జమానాలో వీటివైపు తొంగి చూడనే లేదు. నయా పైసా విదల్చలేదు. ఖరీఫ్, రబీ పంటలకు సాగు, తాగునీరు అందించే కాలువల పట్ల నిలువెత్తు నిర్లక్ష్యం. ఏటా లక్షలాది ఎకరాలకు నీరు సక్రమంగా అందించే కాలువల్లో అత్యంత కీలకమైన లాకుల నిర్వహణను 'లాక్' చేశారు. శెట్టిపేట దగ్గర నుంచి ఆసాంతం నరసాపురం వరకు ప్రధాన కాలువ, ఉప కాలువల వెంట ఇప్పటికే శిథిలమైన లాకులు అనేకచోట్ల దర్శనమిస్తున్నాయి. కనీసం వీటిని మార్చాలని, కాకుంటే మరమ్మతులు చేయాలని రైతులు నెత్తి నోరు కొట్టుకున్నా ఏమాత్రం అప్పటి ప్రభుత్వం చలించనే లేదు. ఆఖరుకి కాలువల ఆధునికీకరణకు సంబంధించి చేతులెత్తేశారు. గోదావరి కాలువల స్థితిగతులు, దుర్భరంగా మారిన కాలువ గట్లు.. బీటలువారిన లాకులు వీటన్నింటిపై 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలించింది. రైతులు పడుతున్న కష్టాలను నేరుగా గమనించింది. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


గుమ్మంపాడు లాకుల వద్ద శిథిలావస్థకు చేరిన తలుపులు


వెంకటాయపాలెం శివారులో గుర్రపు డెక్కతో నిండిన కొవ్వాడ కాల్వ

ప్రతీ ఏటా తప్పని తిప్పలు

గోపాలపురం (ఆంధ్రజ్యోతి) : తాడిపూడి, కొవ్వాడ కాల్వలు దశాబ్దాలుగా ఆధునికీకరణ పనులకు నోచుకోలేదు. కాల్వగట్లపై చెట్లు పెరిగి అడవులను తలపిస్తున్నాయి. నీటిప్రవాహానికి ఈ చెట్లు అడ్డంకిగా మారడంతో దిగువ ప్రాంతానికి సజావుగా సాగునీరు ప్రవహించక పంట పొలాలను ముంపునకు గురిచేస్తుంది. చిట్యాల, చెరుకుమిల్లి, వెంకటాయపాలెం గ్రామాల పంట పొలాల్లో ప్రతీఏటా రైతులు వరినాట్లు వేయడం, ఎగువ ప్రాంతం నుంచి ప్రవహిస్తున్న సాగునీరు పంటను ముంపునకు గురిచేయడం పరిపాటిగా మారింది. తాడిపూడి, కొవ్వాడ, ఎర్రకాల్వ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి కాల్వల ఆధునికీకరణ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరినట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు.

పంట కాలువలపై ఆక్రమణలు తొలగించాలి


కాలువలపై అడ్డుగా వేసిన తూరలు

కొవ్వూరు (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గంలో పంట కాలువలు పూడికలు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో ప్రతి ఏడాది వర్షాకాలంలో పంటలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చొరవతో దొమ్మేరు నుంచి నందమూరు జంక్షన్ వరకు పంట కాలువలు పూడిక తీయించారు. అయితే కాలువలో గుర్రపుడెక్క అక్కడక్కడ వదిలివేయడంతో కాలువలపై రైతులు ఏర్పాటు చేసిన తూరలు వద్ద నిలిచిపోయి నీటి పారుదలకు అడ్డంకిగా మారుతుంది. నందమూరు జంక్షన్‌లోని లేఅవుట్ 3 ఎదుట నుంచి పశివేదలకు వెళ్లే కాలువలో గుర్రపుడెక్క పెరిగిపోయి కాలువ పూర్తిగా నీటి పారుదల సాగడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొవ్వూరు పట్టణంలోని నందమూరు రోడ్‌లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలలో గుర్రపుడెక్క, దుబ్బు ఏపుగా పెరిగి మురుగునీరు ముందుకు పారడం లేదు.

మరమ్మతులు లేవు.. నిర్మాణాలు లేవు..


శెట్టిపేట వద్ద బ్రిటిషర్లు నిర్మించిన వియర్ గట్లు పాడైన దృశ్యం

నిడదవోలు (ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టా కాలువల ఆధునికీకరణ రైతాంగానికి వరం. అయితే గడిచిన వైసీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలే తప్ప పనులకు నోచుకోలేదు. పశ్చిమ డెల్టా పరిధిలో నిడదవోలు మండలం శెట్టిపేట సమీపంలో నీటి పారుదల శాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న వియర్ (వైర్)ను బ్రిటీషర్లు నిర్మించి సుమారు 130 ఏళ్లకు పైగా అవుతుంది. ఆనాటి నుంచి నేటి వరకు చిన్నచిన్న మరమ్మతులే తప్ప దాని స్థానంలో కొత్త నిర్మాణాలు చోటుచేసుకోలేదు. తూతూ మంత్రంగా మరమ్మతులు నిర్వహణ పనులలో భాగంగా కాలువలు వదిలే సమయానికి మట్టి పూడికతీత, తూడుతొలగింపు పనులు చేపట్టి చేతులు దులిపేసుకొంటున్నారు. దీంతో శివారు రైతాంగానికి పూర్తిస్థాయిలో నీరందక గోదావరి పక్కనే ఉన్నా రైతన్నల అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

కొత్తది నిర్మించినా పాతదే దిక్కు..!

పెరవలి (ఆంధ్రజ్యోతి): పెరవలిలో ఇరిగేషన్ పాత లాకుల స్థానంలో కొత్త లాకులు నిర్మించి పది సంవత్సరాలు గడిచినప్పటికి ఇంకా పాత లాకులతోనే కాలం వెల్లదీస్తున్నారు. గత ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో లక్షలది రూపాయలు ఖర్చుతో ఇక్కడ కొత్తగా లాకులు నిర్మించారు. అయితే వాటి నిర్మాణంలో తొందరపాటుగా వ్యవహరించడం సరైన డిజైన్ లేకపోవడంతో అవి ప్రస్తుతం నిరూపయోగంగా ఉన్నాయి. పాత లాకుల కంటే తక్కువ ఎత్తులో నిర్మించడంతో ఎగువ భాగంలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయే పరిస్థితి ఏర్పడంతో లాకులను ప్రస్తుతం పాత లాకులనే కొనసాగిస్తున్నారు. ఈ లాకులపై ఆధారపడి సుమారు 37 వేల ఎకరాలు సాగు నీరు అందాల్సి ఉంది.ప్రస్తుతం కొత్త లాకులను మళ్ళీ ఆధునీకరించడానికి సుమారు రూ.15 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. గతంలో ఏర్పాటు చేసిన మానవ శక్తితో పనిచేసే స్థానంలో యంత్రంలో పనిచేసే గేట్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపించారు.


పెరవలిలో కొత్తగా నిర్మించిన లాకులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

నిడదవోలు సమీపాన ఉన్న శెట్టిపేట లాకులు ఏనాడో శిథిలమయ్యాయి. లీకేజీలమయమయ్యాయి. గట్టు కూడా ఆసాంతం సడలింది. జిల్లా వ్యాప్తంగా డెల్టా పరిధిలో 27కు పైగా లాకులు ఉన్నాయి. వీటి పరిస్థితి చాలా చోట్ల శెట్టిపేటకు దగ్గరగానే ఉన్నాయి. కాకరపర్రు లాకులు చారిత్రాత్మక నెలవైనవి. వీటి మరమ్మతులకు నానా తంటాలు పడాల్సి వచ్చింది. అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లదీ ఇదే పరిస్థితి. నరసాపురం మండలంలో దర్బరేవు, వెస్ట్‌కుక్కులేరు, ఈస్ట్‌కుక్కులేరు పరిధిలో వేలాది ఎకరాలు సాగవుతున్నాయి. వీటి మరమ్మతులకు అనేక ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ నెరవేరనేలేదు. అడుగడుగునా నిర్లక్ష్యం తాండవిస్తుంది. మరోవైపు ఆది నుంచి పంట కాలువల ప్రక్షాళనను రైతులు ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారు. ప్రతీ ఏటా వేసవి తదుపరి వానాకాలం ప్రారంభం కాకమునుపే మరమ్మతులు చేయాలని, కాలువ ప్రవాహం సాఫీగా జరిగేలా చూడాలని, శివారు ప్రాంతాలకు కూడా సమృద్ధిగా నీరు ఇవ్వాలని ఆకాంక్షిస్తూనే వచ్చారు. ఈసారి కూడా కాలువలు, లాకుల మరమ్మతులు జరుగుతాయా, లేదా అనేది ప్రశ్నార్థకంగానే ఉంది. కాలువల్లో ఉన్న తూడు, కాడ తొలగింపుతోపాటు చిన్న చిన్న పనులు చేసేందుకు మాత్రమే కూటమి ప్రభుత్వం ఈ మధ్యన జెండా ఊపింది. అయితే శాశ్వత ప్రాతిపదికన పనులకు మాత్రం ముందడుగు వేయలేకపోతుంది. జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు ఉమ్మడి జిల్లా వాసి కావడంతో ఆ మేరకు కొంతలో కొంత శ్రద్ధపెడుతున్నా పూర్తిస్థాయిలో కాలువల ప్రక్షాళన జరగాల్సి ఉంది.


గణపవరం వద్ద వెంకయ్య వయ్యేరు దుస్థితి

వ్యర్థాలు నేరుగా వయ్యేరులోకే..

గణపవరం (ఆంధ్రజ్యోతి): గుక్కెడు స్వచ్ఛమైన నీరు కోసం 40 గ్రామాల ప్రజలు పరితపిస్తున్నారు. దశాబ్దాల క్రితమే ఈ కాల్వ నీరు తాగ వద్దని శాస్త్రవేత్తలు హెచ్చరించిన గత్యంతరం లేక ఆ నీటినే వాడుతున్నారు. ఇదీ వెంకయ్య వయ్యేరు కాల్వగట్టున ఉన్న పరివాహక గ్రామాల దుస్థితి. 40 గ్రామాల ప్రజలకు వెంకయ్య వయ్యేరు కాల్వ నీరే ఆధారం. ఈ కాల్వ కాలుష్య కోరల్లో చిక్కుకోవడంతో గ్రామస్థులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. కాల్వలో తూడు, చెత్త, గుర్రపుడెక్క పెరిగిపోయింది. కాల్వలు కట్టివేసిన సమయంలో ఇరిగేషన్ ఎటువంటి పనులు చేపట్టకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా గణపవరం పొడవునా కాల్వను అనుకుని ఉన్నవారు తమ మరుగుదొడ్ల వ్యర్థాలను నేరుగా కాల్వల్లోకే వదిలి పెడుతున్నారని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలాది ఎకరాలు చేపలు, రొయ్యల చెరువుల కలుషిత నీరు మొయ్యేరులోనే కలుస్తుంది. పరిమెళ్ల దిగువన కాశీపాడు, జల్లికొమ్మర, బోడపాడు, సరిపల్లెలోని పాలకోడు, నక్కల కోడు, ఇళ్లకోడు, పసికోడు, భూవనపల్లి, తదితర సుమారు 300 మురుగు డ్రైన్ల నీరు వెంకయ్య వయ్యేరులోనే కలుస్తుంది. దీంతో వెంకయ్య కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది.


శిథిలావస్థకు చేరిన దువ్వ రెగ్యులేటర్

ఎప్పుడు కూలిపోతుందో !

తణుకు రూరల్ (ఆంధ్రజ్యోతి): తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని వయ్యేరు రెగ్యులేటర్ శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో కురిసే భారీ వర్షాలకు కూలిపోతుందనే భయం రైతుల్లో నెలకొంది. దువ్వ గ్రామంలో వున్న ఈ రెగ్యులేటర్ వల్ల ఎగువ గ్రామాల రైతులకు మురుగు కాలువగా, దిగువ ప్రాంతాల రైతులకు సాగునీరుగా ఉపయోగంగా ఇక్కడ లాకులను ఏర్పాటు చేశారు ఇక్కడ రెగ్యులేటర్ నిర్మించి సుమారు 90 ఏళ్ల పూర్తవడంతో రెగ్యులేటర్ వద్ద రోడ్డు కోతకు గురై కూలిపోయే ప్రమాదం ఏర్పడిందని రైతులు పేర్కొంటున్నారు. శిథిలావస్థలో వున్న రెగ్యులేటర్ నిర్మాణానికి 2018, 2024 సంవత్సరాలలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ నిర్మాణం చేపట్టలేదు. ఇరగవరం మండలంలో పంట కాలువలలో పేరుకుపోయిన పూడిక తీతన పనులను ఇంకా చేపట్టలేక పోవడంతో రైతులు ఆందోళన చెందుతునారు. ఇరగవరం మండలంలోని తూర్పు విప్పర్రు నరసాపురం కాలువ, కత్తవపాడు, భూపయ్య కాలువల ద్వారా సుమారు 25 వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. ఎగువ నుంచి వస్తున్న వ్యర్థాలతో కాలువలు పూడుపోతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

- ఏటా వీటికి నిర్వహణ భారమే
- రైతులు మొత్తుకున్నా కనికరించని సర్కార్లు
- జగన్ జమానాలో కాలువలు సర్వనాశనం
- పూర్తిస్థాయి నీరందించలేని దుస్థితి
- ఎక్కడికక్కడ కుంగిన కాలువ గట్లు
- దుర్గంధానికి తోడు భారీగా పూడికలు
- ఆధునికీకరణ ఎప్పుడో బుట్టదాఖలు
- కూటమి సర్కార్‌లో ఇప్పుడిప్పుడే కాస్త కదలిక
- 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలన



మిడ్‌లెవిల్ కాలువలో ఆధునికీకరణ పనులు

పెంటపాడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిడ్ లెవిల్ కాలువ ఆధునికీకరణ పనులకు రంగం సిద్ధమైంది. మండలంలోని అలంపురం, రాచర్ల, వల్లూరుపల్లి, దర్శిపర్రు, పెంటపాడు, జట్లపాలెం, తదితర గ్రామాలకు ఇదే కాలవ నుంచి ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు వెళ్తుంది. ఈ కాలువలో తూడు విపరీతంగా పెరిగిపోయి శివారు ప్రాంతాల రైతులకు సాగు నీరు సరిగా అందేది కాదు. దీంతో ఎంఎల్ఏ బొలిశెట్టి శ్రీనివాస్ కాలువ ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. కాలువలో పూడికలు తొలగించి ప్రజలకు నీటితాగు, సాగు నీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ కాలువలో చాలామంది వ్యర్థాలు తీసుకువచ్చి వేసేస్తున్నారు. ఇటువంటి చర్యలకు ప్రజలు స్వస్తి చెప్పాలని అధికారులు కోరుతున్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెలుపుతున్నారు.

వంతులవారీలో రైతులకు ఇబ్బందులు

అత్తిలి (ఆంధ్రజ్యోతి) : గుమ్మంపాడు లాకుల వద్ద పడవలు వెళ్లే మార్గంలో గేట్లు శిథిలావస్థకు చేరడంతో నీరు కిందకు వెళుతోంది. గుమ్మంపాడు లాకుల వద్ద ఉన్న గేట్లు తుప్పుపట్టి రంధ్రాలు పడడంతో నీరు ధారాళంగా కాలువ దిగువ భాగానికి వెళుతోంది. శిథిలావస్థకు చేరిన గేట్ల తలుపులు తొలగించి కొత్త తలుపులు ఏర్పాటు చేయడం ద్వారా సాగునీరు అన్ని ప్రాంతాలకు సక్రమంగా సరఫరా చేసే అవకాశం కలుగుతుంది. అత్తిలి కాలువపై పలు స్లూయిజ్ గేట్లు కూడా శిథిలావస్థకు చేరడంతో నీరు స్లూయిజ్ గేట్ల నుంచి దిగువకు వెళుతోందని, దీనివల్ల వంతుల వారీ విధానంలో సాగునీరు సరఫరాలో రైతులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఏటా మొదటి పంట గల్లంతే

నరసాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా సార్వా పంటను రైతులు కోల్పోవాల్సి వస్తుంది. గత పదేళ్ల నుంచి మండలంలోని ధర్బరేవు, ఈస్ట్‌కొక్కిలేరు, వెస్ట్ కుక్కిలేరు, ఐదు తూముల లాకులు, స్లూయిస్‌లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఈ కారణంగా మొదటి పంట సార్వా ఊడ్చలేని దుస్థితి నెలకొంది. ప్రధానంగా లాకుల పూడిక పనులు చేపట్టకపోవడం వల్ల ఈ కాల్వ పరిధిలోని


మరమ్మతులకు నోచుకోని ధర్బరేవు లాకులు

వందలాది ఎకరాల పంటను రైతులు కోల్పో తున్నారు. గోదావరి వరదలకు, అధిక వర్షాలకు ముంపు నీరు లాగకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఐదు తూముల లాకుల పరిస్థితి కూడా ఇంతే.. ఈ కాల్వల పరిధిలో ఎల్‌బిచర్ల, మోడీ, రామన్నపాలెం, చామకూరి పాలెం, సరిపల్లి, లిఖితపూడి, కొప్పర్రు, చినమామిడిపల్లి గ్రామాల్లో వంద లాది ఎకరాలు సాగు చేసుకుంటారు. లాకులు మరమ్మతులు చేపట్టక పోవడం వల్ల సార్వా పంట వేసేందుకు రైతులు ఆసక్తి చూపించడం లేదు.ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి ఏటా ఈ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపిస్తున్నారే తప్ప పనులకు మాత్రం మోక్షం లభించడం లేదు.


కోడేరు లాకుల వద్ద షట్టర్ పరిస్థితి

లాకులను ఆధునికీకరించాలి

ఆచంట (ఆంధ్రజ్యోతి): ఆచంట నియోజకవర్గంలోని కోడేరు, సిద్దాంతం, లాకులకు సంబంధించి బ్రిటీష్ వారి కాలంలో ఈ లాకులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం లాకుల తలుపులు బాగానే ఉన్నప్పటికి లాకులపై ఉన్న షట్టర్‌లు బలహీనంగా ఉన్నాయి. అలాగే ఈ కాలువ వెంబడి ఉన్న కొన్ని చోట్ల లాకులు మరమ్మతులకు గురయ్యాయి. రైతుల సాగుకు తాగునీటికి సిద్దాంతం, కోడేరు, ప్రధాన బ్యాంక్ కెనాల్‌కు సంబంధించి లాకులు చాలా చాలా ముఖ్యమైనవి. లాకులను ఆధునీకరించాలని పలువురు కోరుతున్నారు. ప్రధాన కాలువలు ఇప్పటి వరకు చెత్త, మట్టితో పూడుకుపోవడంతో ప్రస్తుతం సిద్దాంతం, కోడేరు బ్యాంక్ కెనాల్‌లో సిల్టు తొలగింపు పనులు చేట్టారు.


ఉండి మండలం కలిసిపూడి నుంచి చెరుకువాడ వరకు ఉండి పంటకాలువను అభివృద్ధి పరిచిన దృశ్యం

రూ. 55 లక్షలతో కాలువల అభివృద్ధి

ఉండి (ఆంధ్రజ్యోతి): ఉండి ఇరిగేషన్ పరిధిలో వున్న వేసవిపనులకు ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు చేయడంతో వాటికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అధికారులు పనులు చేపట్టారు. వారం రోజుల నుంచి పంటకాలువ పనులు చురుకుగా సాగుతున్నాయి. పంటకాలువలో పేరుకున్న చెత్త తొలగింపు, పూడికపోయిన మట్టిపనులను, చెత్తాచెదారం తొలగించే పనులను చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వహయంలో కాలువపనులను విడిచిపెట్టారు. వర్షాలకు పంటకాలువ, డ్రైయిన్లు ముంపు బారిన పడి నష్టాల బారినపడేవారు. రైతులంతా డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకురావడంతో ఆయన ప్రభుత్వంతో మాట్లాడి ప్రాధాన్యతా క్రమంలో పనులను చేయడానికి అనుమతులను తీసుకువచ్చారు. దాంతో ఉండి ఇరిగేషన్ పరిధిలో రు.55 లక్షలతో పనులు చేపడుతున్నారు. ఇందులో బాగంగా ఉండి మెయిన్ కాలువ తవ్వకం పనులను రూ. 33 లక్షలతో చేయనున్నారు. రు.8 లక్షలతో వాండ్రం ఛానల్ తవ్వకం పనులు, రూ.6 లక్షలతో కాళ్ల మండలం జక్కరం- బొర్రకోడు ఛానల్ తవ్వకం పనులను, రూ..8 లక్షలతో ఉండి మండలం పాములపర్రు పంటకాలువ పనులకు శ్రీకారం చుట్టారు.

షట్టర్లు దించినా ఆగని నీరు

పెదపాడు (ఆంధ్రజ్యోతి) : కృష్ణా కాలువ వెంబడి తాగు, సాగునీరు విడుదల చేసే సమయంలో కింది ప్రాంతాలకు నీటి విడుదల చేసేందుకు, వరదల సమయంలో నీటిని కిందికి వదిలిపెట్టేందుకు ఏర్పాటు చేసిన షట్టర్లకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. గత కొంత కాలంగా షట్టర్ల వద్ద పెద్దఎత్తున పిచ్చి మొక్కలు, తూడు పెరిగిపోవడం, షట్టర్లు దింపి ఉంచినా వాటి కింద నుంచి కాలువలోని నీరు కిందకు పోతుందని, వీటిని నివారించాలని రైతులు కోరుతున్నారు.

వర్షాకాలంలో నానా అవస్థలు

ఉంగుటూరు (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలంలోని డెల్టా గ్రామాలలో కాలువల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యంతో పరిస్థితి అధ్వానంగా ఉంది. కాల్వల మూసివేతతో నిర్వహణ పనులను చక్కదిద్దేందుకు స్థానిక ఎమ్మెల్యే ధర్మరాజు చొరవ చూపడంతో పాటు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు చేయించారు. కాగుపాడు రెగ్యులేటర్‌తో పాటు తోకలపల్లి మురుగుకోడు వంతెన వద్ద షట్టర్లు ధ్వంసం అవడంతో వర్షాకాలం, వరదల సమయంలో రైతులు నానా అవస్థలు పడుతున్నారు.


వింజరం, కొండంగి లాకుల వద్ద దెబ్బతిన్న షట్టరు

పంట కాలువలు అస్తవ్యస్తం

కైకలూరు (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లల్లో పంటకాలువలు ఆధునికీకరణ చేయకపోవడంతో అస్తవ్యస్థంగా మారాయి. కైకలూరు నియోజకవర్గంలో ప్రధానంగా పోల్‌రాజ్ కాలువ, క్యాంప్‌బెల్ కెనాల్ ద్వారానే తాగు, సాగునీరు చేరాలి. ఈ రెండు కాలువల నుంచి అనేక చిన్నపాటి కాలువలు అనేక గ్రామాలను అనుసంధానం చేసుకుంటూ ఉప్పుటేరులోనికి చేరుతుంటాయి. పోల్‌రాజ్ కాలువలో కైకలూరు మండలం వింజరం వద్ద బ్రిటిష్ కాలంలో ఏర్పాటుచేసిన లాకులు దెబ్బ తినడంతో కొద్దిపాటి మరమ్మతులు నిర్వహించి నీటిని నిలుపుదల చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. వింజరం నుంచి నరసాయిపాలెంకు వెళ్లే షట్టర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పెద్దపెద్ద కానాలు ఉండడంతో నీటిని అదుపు చేయడం అధికారులకు కష్టతరంగా మారింది. సీతనపల్లి, గోపవరం వెళ్లే పంటకాలవలకు షట్టర్లు లేవు. ముదినేపల్లి మండలంలో పోల్‌రాజ్ పంటకాలువ నుంచి చిన్న అన్నవరం బ్రాంచి కాలువ రిటైనింగ్‌వాల్ ధ్వంసమై సంవత్సరాలు గడుస్తుంది. వడాలి సమీపంలో పైపుకల్వర్టు వద్ద పోల్‌రాజ్‌కు రెండు వైపులా నిర్మాణం చేసిన రిటైనింగ్‌వాల్ బీటలు వారి కూలిపోయింది. పెరికేగూడెం, పెయ్యేరు, కొర గుంటపాలెం గ్రామాల్లోని కాలువ షట్టర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కలిదిండి మండలంలోని క్యాంప్‌బెల్ కెనాల్‌కు కోరుకొల్లు లాకులు పైన అనేక చోట్ల పంట కాలువగట్లు ధ్వంసమయ్యాయి. కొండంగి, పెదలంక వెళ్లే పంట కాలువలకు షట్టర్లు లేవు. ఈ షట్టర్ల నిర్మాణానికి జలవనరులశాఖ అధికారులు రూ.2 కోట్ల వ్యయంతో, క్యాంప్‌బెల్ కెనాల్‌కు కోరుకొల్లు లాకుల పైనుంచి గుడ్లవల్లేరు వరకు అనేకచోట్ల గట్లు పటిష్టం చేసేందుకు రూ.90 లక్షల వ్యయంతో ప్రతిపాదనలు అందజేశారు.


ఓల్డ్ సీసలి పంట కాలువను తవ్వుతున్న దృశ్యం

రైతుల సహకారంతో కాలువల ప్రక్షాళన

కాళ్ళ (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడా పంట కాలువలపై సరైన దృష్టి సారించకపోవడంతో ఏ కాలువ చూసినా చెత్తాచెదారం, గుర్రపుడెక్కతో పూడుకుపోయి అస్తవ్యస్తంగా ఉండేవి. నీటి ప్రవాహం ముందుకు సాగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పంట కాలువలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు నీటి సంఘాలను పునరుద్ధరించడంతో రైతుల కష్టాలు తీరాయి. ఉండి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా దాతలు, రైతుల సహకారంతో సీజీఎఫ్ ఫండ్ ఏర్పాటు చేసి పంట, మురుగు కాలువల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురైన గట్లు ప్రక్షాళన చేయడంతోపాటు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న అనధికార తూములు తొలగించడంతో నియోజకవర్గంలోని పలు కాలువలకు మహర్దశ వచ్చిందని రైతులంటున్నారు. కాళ్ళ, ఉండి, ఆకివీడు, పాలకోడేరు మండలాల పరిధిలోని కాలువల మరమ్మతుల పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి.

ఈ గ్రామాలు సురక్షితమేనా..?

నరసాపురం రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరదొస్తే ఆ గ్రామాలు వణికిపోతాయి.. నివాసాలు వదిలి ప్రాణాలను కాపాడుకునేందుకు పడవ ఎక్కాల్సిందే.. నరసాపురం పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్త, పాత నవరసపురం గ్రామాలు వరదొస్తే విలవిల్లాడిపోతాయి. యలమంచిలి మండలం కాజా స్లూయిస్ తలుపులు గుండా వరద నీరు గ్రామాల్లోకి చొచ్చుకొచ్చేస్తుంది, దీనికి అడ్డుకట్ట వేయలేకపోవడంతో ఈ రెండు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోతాయి, సక్రమంగా లాకులు లేకపోవడంతో ప్రతి ఏటా గోదావరికి వరదొస్తే చాలు గ్రామ ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తారు. వరద తగ్గే వరకు ఇంటి నుంచి బయటకు రాని పరిస్థితి. ఈ సమస్య పరిష్కరించాలని చాలా ఏళ్ల నుంచి ప్రజలు ప్రజాప్రతినిదులకు, అధికారులకు విన్నవిస్తూనే ఉన్నాయి. కానీ శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదు.

గతేడాది కాజా లాకులు ఏర్పాటు

ఏటా ఏదో సమయంలో గోదావరికి భారీ ఎత్తున వరద ముంచెత్తుతుంది. ఎగువ నుంచి వరద నీరు గోదావరిలోకి విడిచిపెట్టడంతో ఆ ప్రభావం ఈ రెండు గ్రామాలపై పడుతుంది. గోదావరి గట్టు పక్కనే ఉన్న పాత, కొత్త

గోదావరికి వరదొస్తే ఏటా కొత్త, పాత నవరసపురం గ్రామాలు మునకే

లాకుల నిర్మాణంతో తొలగిన భయం

నవరసపురం, బాడవ, యలమంచిలి ప్రాంతాలు ముంపు బారిన పడుతుంటాయి. ఈ సమస్యకు కాజా అవుట్‌పాల్ స్లూయిస్‌లే ప్రధాన కారణమని భావించిన అధికారులు అప్పట్లో తాత్కాలిక లాకులు ఏర్పాటు చేశారు. వరద తగ్గుముఖం పట్టిన తరువాత లాకుల్ని పూర్తి స్థాయిలో నిర్మించారు. దీంతో పాత, కొత్త నవరసపురం గ్రామాలకు ఈ ఏడాది వరద తాకినా గ్రామాలు సేఫ్ అన్న అభిప్రాయంలో గ్రామస్థులు ఉన్నారు.

కొత్త నవరసపురం ఎస్టీకాలనీలో లాకులు ఏర్పాటు చేస్తే..

మరోవైపు గోదావరికి సమీపంలో ఉన్న కొత్త నవరసపురం ఎస్టీకాలనీ, పట్టణంలోని లాకుపేటలు వరద ఎప్పుడొచ్చినా ముంపుబారిన పడతాయి. నివాసాలను చుట్టూ వరద నీరు చుట్టేస్తుంది.చాలా ఏళ్ల నుంచి లాకులు శిథిలావస్థకు చేరాయి. వీటిని తొలగించి కొత్త లాకులు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం ముంపుబారిన


వరదల సమయంలో పడవలపై వెళుతున్న నవరసపురం ప్రజలు (ఫైల్)

నుంచి బయట పడుతుంది. అంతేకాకుండా పాత నవరసపురం గ్రామంలోకి వరద నీరు కూడా చేరదు. ప్రజాప్రతినిధులు స్పందించి లాకుల్ని నిర్మించాలని గ్రామస్థులు విన్నవిస్తున్నారు.

ఎస్టీ కాలనీలో లాకులు ఏర్పాటు చేయాలి



గోదావరికి వరద తాకినప్పుడల్లా మా గ్రామం మునిగిపోతుంది. బయటకు వెళ్లాంటే పడవలపై ప్రయాణించాలి, ఈ సమస్యకు ప్రధాన కారణం కాజా స్లూయిస్. వరద నీరు పెద్ద ఎత్తున గ్రామానికి రావడంతో లాకుల్ని రిపేర్లు చేశారు. అయితే కొత్త నవరసపురం గ్రామంలోని ఎస్టీకాలనీలో ఉన్న లాకుల్ని కూడా రిపేర్లు చేయాలి. అ పని చేస్తే రెండు గ్రామాలు వరదల సమయంలో సేఫ్‌గా ఉంటాయి.

-చిట్టి మోషే, పాత నవరసపురం



విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఆచార్యులు

భవిష్యత్‌లో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ కీలకం

తాడేపల్లిగూడెం అర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ పాత్ర కీలకమని, విద్యార్థులందరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని ఏపీ నిట్ డీన్ జీబీ వీరేశ్ కుమార్ అన్నారు. సంస్థలోని మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8, 9, 10 తరగతుల విద్యార్థులకు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ అవగాహన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. డాక్టర్ సంతోష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీరేశ్‌కుమార్ మాట్లాడుతూ వస్తువుల నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టేందుకు త్రీడీ ప్రింటింగ్ సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీని పలు రంగాల్లో ఉపయోగిస్తున్నారని, విద్యార్థులు దీనిపై నైపుణ్యాలను పెంచుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఆచార్యులు డాక్టర్ కార్తికేయ శర్మ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. అనంతరం 40 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, ప్రతిభ కనపర్చిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ హైమామతి తదితరులు పాల్గొన్నారు.

పార్శిల్ రవాణా సంస్థలు ఆర్టీఏ లైసెన్సు తీసుకోవాలి

ఏలూరు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పార్శిల్ రవాణా సంస్థలు ఆర్టీఏ లైసెన్సు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ షేక్ కరీమ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు చొదిమెళ్లలో ఉన్న డీటీసీ కార్యాలయంలో జిల్లాలోని పార్శిళ్ల రవాణా సంస్థల యజమానులతో, ప్రతినిధులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన క్యారేజీ బైరోడ్డు యాక్టు 2007, క్యారేజీ బై రోడ్డు రూల్స్ 2011 ప్రకారం రవాణా సంస్థలు ఆర్టీఏ కార్యాలయం నుంచి లైసెన్సు పొందాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే రవాణా వాహనాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహన తనిఖీ అధికారులు ఎండి విఠల్, ఎస్‌బీ శేఖర్, టి.రమేష్ బాబు, పార్శిల్ రవాణా సంస్థల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆక్వా షాపుల్లో అధికారుల తనిఖీలు

దుకాణాలు మూసి యజమానుల పరార్

పెదపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలంలో పెదపాడు గ్రామంలోని ఆక్వా షాపు లను మత్స్యశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి బి.నరసయ్య, ఏడీఎఫ్ బి.రాజకుమార్, పెదపాడు మత్స్యశాఖ అధికారి సతీష్‌కుమార్ ఆయా షాపుల్లోని మందులు, కెమికల్స్, యాంటీ బయోటిక్స్, రసాయనాలను తనిఖీ చేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి నరసయ్య మాట్లాడుతూ ఆక్వా షాపుల్లో నిషేధిత రసాయనాలు, ఇతర యాంటీబయోటిక్స్‌లను అమ్మకాలు సాగిస్తున్నట్టుగా అందిన సమాచారం మేరకు తనిఖీలను నిర్వహించామన్నారు. నిషేధిత మందులను అమ్మకాలు జరిపే షాపులను సీజ్ చేస్తున్నామన్నారు. కొన్ని మందుల శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం సేకరించారు. అధికారులు ఆక్వా షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో పెదపాడు, చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో వున్న ఆక్వా షాపులను యాజమానులు మూసివేశారు. అధికారులు రెండు షాపులను తనిఖీ చేసి వెనుతిరిగారు. మిగతా షాపుల్లో స్థానికంగా వున్న అధికారులు తనిఖీలు నిర్వహిస్తారని వారు తెలిపారు. తనిఖీల్లో వీఆర్వో నరసింహా, వీఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

'గోపాలమిత్ర' వ్యవస్థ పరిశీలనకు కమిటీ

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలోని గోపాలమిత్ర వ్యవస్థ పనితీరును పరిశీలించడానికి ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఏపీ లైవ్‌స్టాక్ ఏజెన్సీ సీఈవో అధ్యక్షతన పశుసంవర్ధక, పశు వైద్య నిపుణులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019కు ముందున్న విధంగా గోపాలమిత్ర వ్యవస్థను కొనసాగించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని, గ్రామ పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రల మధ్య జాబ్‌చార్ట్‌పై స్పష్టమైన హద్దును సూచించాలన్నారు.



గణపవరం సెంటర్‌లో 500 అడుగుల జాతీయ జెండాతో మానవహారం



ఏలూరులో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చంటి, జనసేన, బీజేపీ నాయకులు

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

గణపవరం/ ఏలూరు రూరల్/ ద్వారకాతిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి):ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ఉగ్రవాద స్థావరాలపై దాడి యావత్ భారతవనికి గర్వకారణమని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గణపవరంలో శుక్రవారం నిర్వహించిన తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌లో మన భద్రత బలగాలు పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలు నేలమట్టం చేసి భారత్ వీరులుగా భారతమాత ముద్దుబిడ్డలుగా గుర్తింపు పొందారని ధర్మరాజు పేర్కొన్నారు. ఆప్కాబ్ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన భారతసైన్యం, ప్రాణ త్యాగం చేసిన వీరజవాన్లకు దేశ ప్రజలు శ్రద్ధాంజలి అర్పించడం దేశభక్తిని ప్రోత్సహించడమే అన్నారు. తొలుత గణపవరం సెంటర్‌లో 300మీటర్ల జాతీయ జెండాతో మానవహారం నిర్వహించి అనంతరం పురవీధుల్లో తిరంగ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో చరణాల మాలతిరాణి, ఇందుకూరి రామకృష్ణంరాజు, పొత్తూరి వాసురాజు, అద్దేపల్లి వాసురాజు, నిమ్మల దొరబాబు,తోట శ్రీనివాసరావు, ముత్యాల స్వామి, కూటమి నేతలు పాల్గొన్నారు.

బ్రహ్మోస్ అస్త్రంతో ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తోన్న పాక్ వెన్నులో వణుకు పుట్టించిన త్రివిధ దళాల సైనికులకు యావత్ దేశమంతా మద్దతుగా నిలిచిందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా ఏలూరులో శుక్రవారం భారీగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటూ ఆర్టీసీ విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిషోర్, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు అంబికా కృష్ణ, జనసేన రాష్ట్ర నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి పాల్గొన్నారు. యువతీ యువకులు పెద్దసంఖ్యలో జాతీయ పతాకాలు పట్టుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రామకోటి ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ పలు ప్రాంతాల మీదుగా పాత బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ మానవహారం నిర్వహించి, జాతీయ సమైక్యత, సమగ్రత చాటేలా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే చంటి, రెడ్డి అప్పలనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ్‌కిషోర్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులపై దాడిని యావత్ దేశం సమర్థిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు అంబికా కృష్ణ మాట్లాడుతూ దేశ ఆయుధ సంపత్తి బలాన్ని ఆపరేషన్ సిందూర్‌తో నిరూపించిన సైన్యానికి, ప్రధాని మోదీకి ధన్యవాదలు తెలిపారు.



ఐఎస్ జగన్నాథపురంలో తిరంగా యాత్రలో ఎమ్మెల్యే మద్దిపాటి, కూటమి నేతలు

ద్వారకాతిరుమల మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. జాతీయ జెండాలు పట్టుకుని భారతసైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తితో తిరంగా యాత్ర జరిపారు.

లక్ష్మీనరసింహస్వామికి 30 ఎకరాల భూహక్కు పత్రాల అందజేత

ద్వారకాతిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండల సుందరగిరిపై కొలువైఉన్న శ్రీలక్ష్మీనారసింహుని ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన 30 ఎకరాల భూమి హక్కు పత్రాలను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శుక్రవారం ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తికి అందించారు. గతేడాది నవంబర్‌లో దీపం పథకం ప్రారంభోత్సవానికి ఐఎస్ జగన్నాథపురం వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆలయ అభివృద్ధికి భూమి కేటాయింపునకు హామీ ఇచ్చారు.ఈ నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో గత ఆరునెలలుగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది సర్వే నిర్వహించి ఆర్ఎస్ నెం.425-193లో కేటాయించిన 30 ఎకరాల భూమికి హద్దులు నిర్ణయించారు. భూమిని దేవస్థానానికి అప్పగించే కార్యక్రమంలో భాగంగా తొలుత ఎమ్మెల్యే లక్ష్మీ నారసింహుని మూలవిరాట్‌ను సందర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం తహసీల్దార్ జేవీ సుబ్బారావు పర్యవేక్షణలో భూహక్కు పత్రాలను ఈవోకు అందించారు. కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.



ఐఎస్ జగన్నాథపురంలో భూహక్కు పత్రాలను ఎమ్మెల్యే నుంచి స్వీకరిస్తున్న ఈవో మూర్తి

నాలుగు ఆర్‌వోబీల నిర్మాణానికి కేంద్రం అనుమతి

ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్



ఏలూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నాలుగు చోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్‌ఓబీ) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వేకి సంబంధించిన సమస్యలపై ఢిల్లీలో నిరంతరం పర్యవేక్షిస్తున్నానని, ఫలితంగా మొదటి విడతగా నాలు ఆర్‌వోబీల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపిందని తెలిపారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల, కొల్లేరు పర్యాటక కేంద్రానికి రాకపోకలు సాగించడానికి వీలుగా జాతీయరహదారిపై వాహనాల రద్దీని నియంత్రించడానికి వీలుగా భీమడోలు వద్ద, అప్‌ల్యాండ్ నుంచి డెల్టాకు రాకపోకలు అవకాశం కల్పించడానికి స్థానిక ప్రజల కోరిక మేరకు కైకరం వద్ద అప్‌ల్యాండ్ నుంచి జి.కొత్తపల్లి మీదుగా నరసాపురం సముద్ర తీరానికి అనుసంధానించే చేబ్రోలు వద్ద, నల్లజర్ల నుంచి జాతీయ రహదారికి లింక్ రోడ్లను కలుపుతూ హార్టీకల్చర్ విశ్వవిద్యాలయానికి వెళ్లే మార్గంలో ఉంగుటూరు వద్ద ఒకటి చొప్పున మొత్తం నాలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించగా తాజాగా అనుమతి లభించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాన్, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రైల్వే సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని అడిగిన వెంటనే తక్షణమే స్పందిస్తున్న ప్రధాని మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆరు, ఏడు నెలల్లో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు.

పది జిల్లాల్లో డీసీహెచ్‌లు మార్పు

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పనితీరు సరిగా లేదనే కారణంతో వైద్య ఆరోగ్య శాఖ పది జిల్లాలకు కొత్త జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీసీహెచ్)లను నియమించింది. అల్లూరి సీతారామరాజు, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, తిరుపతి, నంద్యాల, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో డీసీహెచ్‌లను మార్చింది. గత మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే పది జిల్లాల అధికారులను మార్చారు. ఆయా జిల్లాల్లో సెకండరీ ఆసుపత్రుల పనితీరుపై తరచూ సూచనలు, హెచ్చరికలు చేసినా వారిలో మార్పు రాలేదని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అధికార వర్గాలు తెలిపాయి.

వీవోఏపై కేసు

గణపవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండలం ముగ్గళ్ల గ్రామంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన స్త్రీనిధి సొమ్ము అపహరించారన్న ఆరోపణపై వీఓఏ వెంకటలక్ష్మిపై గణపవరం పోలీసులు కేసు నమోదు చేశారు. గణపవరం ఎస్సై మణికుమార్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఏపీఎం ఎస్ఎస్.అమీఉన్నీస, జిల్లా అధికారుల ఆధ్వర్యంలో బాధితుల ఫిర్యాదు మేరకు వెంకటలక్ష్మి పై కేసు నమోదు చేశామని ఎస్సై మణికుమార్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి) : భర్త, అత్తింటి వారి వేధింపులు భరించలేక ఒక వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఏలూరు సమీపంలోని వట్లూరునకు చెందిన నంబూరి పూజిత (22)కు భర్త ప్రశాంత్, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పది రోజుల క్రితం కుమారుడు అనారోగ్యంతో మరణించాడు. అప్పటి నుంచి భర్త అత్త మామలు, ఆడపడుచు, మరిది పూజితను వేధిస్తున్నారు. వారి వేధింపులు భరించలేక తన పుట్టిల్లు అయిన లింగపాలెం మండలం రంగాపురం తన పుట్టింటికి వచ్చేసింది. మానసికంగా వేదనకు గురై శుక్రవారం పురుగుమందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఐదుగురిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని భార్యభర్తలను మోసగించిన ఐదుగురిపై ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు అయింది. ఏలూరు తూర్పువీధినకు చెందిన రాజాని షన్ముఖ శ్రీవెంకట దుర్గాసాయికి ఆన్‌లైన్‌లో గోవింద్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇస్తానని అనడంతో దుర్గాసాయి, అతని భార్య కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కావాలని అడగడంతో ఐదు లక్షల రూపాయలు డిపాజిట్ చెల్లించాలని కోరడంతో సొమ్ములను చెల్లించారు. ఎంతకి ఉద్యోగం రాకపోవడంతో గోవిందు, అతనితోపాటు మరో నలుగురిపై ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోలు మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై కేసు

ఏలూరు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టుకున్న ఫొటోలను ఒక వ్యక్తి మార్ఫింగ్ చేసి యూట్యూబులో పెట్టడంతో బాధితురాలు గుర్తించి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఏలూరులోని ఓ ప్రాంతానికి చెందిన యువతి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఉంది. ఆ యువతి, ఆమె సోదరి ఫొటోలు కలిసి ఉన్న వాటిని పెట్టింది. అయితే ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫొటోలను మార్ఫింగ్ చేసి యూట్యూబ్‌లో బాచీ బాచీ అనే అకౌంట్ పేరుపై అప్‌లోడ్ చేశాడు. బాధితురాలు గుర్తించి ఏలూరు టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్టు క్యారేజీ బస్సుల తనిఖీ

రూ.3.70 లక్షల జరిమానా

ఏలూరు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ షేక్ కరీమ్ ఆధ్వర్యంలో ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్‌గేటు వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ విస్తృతంగా ప్రైవేటు బస్సుల తనిఖీలు చేశారు. మొత్తం 85 కేసులు నమోదు చేసి రూ. 3.70 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. విశాఖపట్నం నుంచి విజయవాడ, విజయవాడ నుంచి విశాఖపట్నం మధ్య తిరిగే కాంట్రాక్టు క్యారేజీ బస్సులను క్షుణ్ణంగా పరిశీలించి తనిఖీలు నిర్వహించామన్నారు. పర్మిట్ నిబంధనలను ఉల్లంఘించిన 85 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో జంగారెడ్డిగూడెం ఆర్టీవో ఎండి మదానీ, వాహన తనిఖీ అధికారులు ఎస్ రంగనాయకులు, డి ప్రసాదరావు, బి స్వామి, సురేష్‌బాబు, ఎస్ జగదీష్‌బాబు, కల్యాణి, కృష్ణవేణి, నరేంద్రబాబు, అన్నపూర్ణ, డి ప్రజ్ఞలు పాల్గొన్నట్లుగా డీటీసీ కరీమ్ తెలిపారు.

తండ్రిని చంపిన తనయుడు



దెందులూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): తండ్రిని రోకలిబండతో కొట్టి హత్య చేసిన ఘటన సంచలనంగా మారింది. దెందులూరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దెందులూరు మండలం పోతునూరు శివారు ఉండ్రాజవరం గ్రామానికి చెందిన అంబల్ల సింహాచలం(72)కు ఇద్దరు కొడుకులు. ఒక కొడుకు ఏలూరులో ఉంటుండగా రెండవ కుమారుడు అంబల్ల పెద్ద సన్యాసిరావు తల్లిదండ్రులతో కలిసి ఉండ్రాజవరం లో ఉంటున్నాడు. అయితే సన్యాసిరావుకు భార్య చనిపోవడంతో రెండవ పెళ్లి చేసుకున్నాడు. రెండవ భార్యకు సన్యాసిరావుకు మధ్య విభేదాలు రావడంతో తండ్రి ఇంట్లోనే కొడుకు ఉంటున్నాడు. ఇటీవల సన్యాసిరావు కుమారుడు మృతి చెందాడు. కుమార్తె సన్యాసరావుకు ఇష్టం లేని ప్రేమ వివాహం చేసుకున్నది. శుక్రవారం మృతుడు అంబల్ల సింహాచలం (72) తన భార్యతో కలిసి వివాహ వేడుకలు వెళ్లి ఇంటికి వచ్చి పడుకున్నాడు. అయితే కారణం తెలియదు గానీ తండ్రి కొడుకుల మధ్య ఏం జరిగిందో కానీ సన్యాసిరావు రోకలిబండతో తండ్రి సింహాచలం తలపై కొట్టి హత్య చేశాడు. ఎస్ఐ శివాజీ నిందితుడిని అరెస్టు చేశారు.

దేవాలయాలే టార్గెట్

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

30 గ్రాముల బంగారు ఆభరణాలు.. మోటార్ సైకిల్ స్వాధీనం

ఏలూరు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగను అరెస్టు చేసి 30 గ్రాముల బంగారు ఆభరణాలు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఏలూరు త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు తెలిపారు. విజయవాడ కొత్తపేటకు చెందిన ఈమని రాంబాబు (62) కొన్ని సంవత్సరాలుగా దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. దేవాలయాలకు వెళ్ళి భక్తుడిలాగ నటిస్తూ గుడిలోకి ప్రవేశించి పూజారితో మాటలు కలిపి పూజారిని దృష్టి మరల్చి విగ్రహాలపై ఉన్న బంగారపు ఆభరణాలను క్షణాల్లో తస్కరించి వెళ్ళిపోతాడు. ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్రంపాడులో ఉన్న సౌభాగ్యలక్ష్మి అమ్మవారి గుడిలో బంగారు ఆభరణాలు అపహరణకు గురికావడంతో త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనేరానికి పాల్పడిన ఈమని రాంబాబును శుక్రవారం అరెస్టు చేశారు. అతనిని పూర్తి స్థాయిలో విచారణ చేయగా ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు కృష్ణాజిల్లా పమిడిముక్కల పోలీస్ స్టేషన్ పరిధిలోనూ, గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోను దేవాలయాల్లో చోరీలకు పాల్పడినట్లుగా అంగీకరించాడు. మొత్తం అతడిపై ఇప్పటి వరకు 50 కేసులు ఉన్నట్లుగా వెల్లడైంది.



రెయింలింగ్‌ను ఢీకొన్న కారు

ఒకరి మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు

జీలుగుమిల్లి, మే 16: (ఆంధ్రజ్యోతి): కారు రెయిలింగ్‌ను ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. గుల్ల(పిలక) పొగాకు కొనుగోలు చేసే ఐదుగురు వ్యక్తులు శుక్రవారం కారులో జంగారెడ్డిగూడెం వైపు నుంచి జీలుగుమిల్లి వస్తుండగా లక్ష్మీపురం సమీపంలో కారు ప్రమాద వశాత్తు జాతీయ రహదారికి అమర్చిన రెయిలింగ్‌ను ఢీకొంది. దీంతో కారు అదుపు తప్పి తుప్పల్లోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న వారు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణించే ఐదుగురిని 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించగా కొయ్యలగూడెం మండలం పరింపూడి సర్పంచ్ ముప్పిడి విజయకుమారి మరిది ముప్పిడి ప్రసాద్ (55) మృతి చెందాడు. గతంలో మృతుడు టైలరింగ్ చేస్తూ (టైలర్ ప్రసాద్) జీవనం సాగించాడు. కొద్ది రోజుల నుంచి గుల్ల(పిలక) పొగాకు కొనుగోలు వ్యాపారం చేస్తున్నాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై పి.నవీన్‌కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో చేపల ప్యాకింగ్ కూలీ మృతి

మండవల్లి మే 16(ఆంధ్రజ్యోతి): ఏలూరులో చేపల ప్యాకింగ్ పని చేసుకుని ద్విచక్రవాహనంపై ఇంటి రాంబాబు, ముత్యాల లాజర్ అనే వ్యక్తులు కైకలూరు వైపు వస్తున్నారు. మార్గమధ్యలో మణుగులూరు వద్ద కైకలూరు నుంచి ఏలూరు వెళుతున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మండలంలోని లోకుముడి గ్రామానికి చెందిన ఇంటి రాంబాబు(40) అక్కడికక్కడే మృతి చెందగా మరో చేపలప్యాకింగ్ కూలీ ముత్యాల లాజర్‌కు తీవ్రగాయాలయ్యాయి.

లారీ డ్రైవర్‌కు ఏడు సంవత్సరాల జైలు శిక్ష

ఏలూరు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి నిర్లక్ష్యంగా లారీ నడిపి ఒక వ్యక్తి మరణానికి కారణమైన లారీ డ్రైవర్‌పై నేరం రుజువు కావడంతో ఏడేళ్ళ జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ కొవ్వూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం బుట్టాయిగూడెం మండలం టిఆర్‌గూడెంకు చెందిన నడపాల మంగిరెడ్డి కొయ్యలగూడెం చేపల మార్కెట్ వద్ద పోలీస్ స్టేషన్ పరిధిలో వెళుతుండగా ఒక లారీ అతనిని ఢీకొంది. ఈ సంఘటనలో మంగి రెడ్డి అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటనపై అప్పటి కొయ్యలగూడెం ఎస్ఐ ఎం సూర్యభగవాన్ కేసు నమోదు చేయగా అప్పటి సీఐలు పి.రాజేష్, బాలరాజు దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. లారీ డ్రైవర్ అయిన నల్గొండ జిల్లా మార్కెట్‌పల్లి మండలం మింగోటం గ్రామానికి చెందిన చెరుకూరి నరసింహ (50)ని అరెస్టు చేశారు. లారీ డ్రైవర్ చెరుకూరి నరసింహ మద్యం తాగి నిర్లక్ష్యంగా లారీని నడిపి మంగిరెడ్డి మరణానికి కారకుడయ్యాడని నేరం రుజువు కావడంతో అతనికి ఏడేళ్ళ జైలు శిక్ష, 1000 రూపాయలు జరిమానా విధించారు. మృతుని కుటుంబానికి పది లక్షల రూపాయల నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని జడ్జి ఉత్తర్వుల్లో జారీ చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కె వెంకటరమణ వాదించగా ప్రాసిక్యూషన్‌కు కొయ్యలగూడెం ఎస్ఐ చంద్రశేఖర్, కోర్టు కానిస్టేబుళ్ళు సహకరించారు.

తేనెటీగల దాడిలో ఐదుగురికి గాయాలు



బాధితుడికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

పోలవరం, మే 16 (ఆంధ్రజ్యోతి) : అడవి తేనెటీగల దాడిలో ఐదుగురు వ్యక్తులు గాయపడిన సంఘటన పోలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన బొట్టు మహేష్, బొట్టు సతీష్, బొట్టు మరియమ్మ, పిల్లి రాజు శుక్రవారం పోలవరం రిజిస్ట్రార్ కార్యాలయానికి తమ రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు నిర్వహించు కోవడానికి వచ్చారు. కార్యాలయం ఎదురుగా ఉన్న వేపచెట్టుకి ఉన్న తేనెపట్టు కదిలి తేనెటీగలు అక్కడే రిజిస్ట్రేషన్ పనిపై వచ్చిన వారిపై దాడి చేశాయి. దీంతో అక్కడి జనం దూరంగా పరుగులు తీశారు. కార్యాలయం సిబ్బంది తలుపులు మూసుకుని తేనెటీగలు కుట్టకుండా జాగ్రత్తపడ్డారు. తేనె టీగల దాడిలో గాయపడ్డ చిట్యాల గ్రామస్థులు ఐదుగురిని పోలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన బొట్టు మహేష్‌ని అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు వైద్యాధికారి తెలిపారు.

కవిటంలో పిడుగు పడి వ్యక్తి మృతి



సంసోను (ఫైల్‌ఫోటో)

పోడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కవిటం శివారు ఉత్తరపాలెంకు చెందిన సనమండ సంసోను(52) గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోడూరు ఏఎస్సై ఏసుబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశువులను పాకలో కట్టేస్తున్న సమయంలో పిడుగు పడిందని దీంతో గాయపడి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు సంసోనుకు భార్య అనంతలక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని పోడూరు తహసీల్దార్ ఎస్ఎం.ఫాజిల్ పరిశీలించారు. భార్య అనంతలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఏసుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి బిహార్ యువకుడి మృతి

ఏలూరు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి) : బీహార్‌కు చెందిన ఒక యువకుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బిహార్‌కు చెందిన రాహుల్‌కుమార్ (23) బెంగళూరులోని ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఈనెల 14వ తేదీన బెంగళూరు నుంచి బిహార్ వెళ్ళడానికి రైలు ఎక్కాడు. ముజాఫర్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. రైలులో ప్రయాణిస్తున్న అతను భీమడోలు రైల్వే స్టేషన్ దగ్గరలో రైలు నుంచి శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్‌కు అందడంతో తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహనికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

భీమవరం క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లకు బానిసై అప్పులు తీర్చలేక ఒక వ్యక్తి ఎలుకల మందు కలిపిన మద్యం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ హెచ్‌సీ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మెంటేవారితోట రైల్వే ట్రాక్ సమీపంలో ఈ నెల 12వ తేదీన ఎండి అబ్దుల్ కరీం (56) అనే వ్యక్తి ఎలుకల మందు మద్యంలో కలుపుకుని తాగాడు. అనంతరం ఇంటికి వెళ్ళి భార్య ఫాతిమా బేగంకు విషయం చెప్పాడు. దీంతో ఆమె వెంటనే భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఐదు గంటలకు మృతి చెందినట్లుగా సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్ళి వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి వెంకటేశ్వరరావు తెలిపారు.

రైతులందరూ భూసార పరీక్షలు చేయించాలి

దెందులూరు, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తమ భూములను భూసార పరీక్షలు చేయించాలని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలో 1,432 లక్ష్యం ఉండగా ఇప్పటికి 512 మట్టి నమూనాలను స్వీకరించామని ఏవో దామ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం దెందులూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో ఒకే రకమైన పంటలను వేయకుండా పంట మార్పిడి వేస్తూ, అంతర పంటలను వేసుకోవాలన్నారు, ప్రభుత్వం అందించే సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గిరిజన చట్టాలను అమలు చేయాలి : సీపీఎం నేత

కుక్కునూరు, మే 16 (ఆంధ్రజ్యోతి):ఏజెన్సీలో గిరిజన చట్టాలు పటిష్ఠంగా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పిల్లి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కార్యకర్తల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు, గిరిజనులకు సంబంధించిన చట్టాలను మార్పు చేస్తూ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి సాయికిరణ్, మానుకొండ జీవరత్నం, వై.నాగేంద్రరావు, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో ముందుండాలి : ఎమ్మెల్యే సొంగా


తాడువాయిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం/ లింగపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో ముందుండాలని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సూచించారు. శుక్రవారం లింగపాలెం మండలం కలరాయనగూడెంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ హైస్కూల్లో పదో తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. గరిమళ్ల చలపతి రావు, మోరంపూడి మల్లికార్జునరావు, పిల్లల శ్రీనివాస్‌యాదవ్, పలువురు నాయకులు ఉన్నారు. జంగారెడ్డిగూడెంలోని సీతారామ కల్యాణ మండపంలో ఒకటి నుంచి ఐదు వార్డుల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జంగారెడ్డి గూడెంలో తహసీల్దార్ కె.స్లీవజోజి, మునిసిపల్ కమిషనర్ కేవీ రమణ, పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు రావూరి కృష్ణ,సాయిల సత్యనారాయణ, టీడీపీ నాయకులు పరిమి సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెంలోని తాడువాయి తూర్పు వీధిలో ప్రభుత్వం చేపట్టిన పల్లె వెలుగు-స్వర్ణ గ్రామం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలు తెలుసుకుని పలు సమస్యలను అధికారుల సహకారంతో అక్కడికక్కడే పరిష్కరించారు. రాత్రి పొద్దుపోయే వరకు ప్రజలతోనే మమేకమై ఉన్నారు.

మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యం : చిర్రి

టి.నరసాపురం, మే16(ఆంధ్రజ్యోతి) :గ్రామస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పోలవ రం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. శుక్రవారం శ్రీరామవరంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అడపా నాగరాజు జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలో స్థానిక సమస్యలపై గ్రామస్థులతో చర్చించారు. రామమ్మగూడెంలో రోడ్లు, గృహవసతి, మంచినీటి సమస్యలు, తదితర వాటిపై నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి, కరాటం సాయి, గడ్డమనుగు రవికుమార్, నల్లూరి వెంకట చలపతిరావు, బొడ్డు సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణరావుగౌడ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పూడికతీత, ఆక్రమణలపై దృష్టి సారించాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఆక్రమణలకు గురైన చెరువులు, చెర్వుల పూడికతీతపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే ధర్మరాజు కోరారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులను కోరారు. ఆక్రమణలు, పూడికతీతపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు.

ప్రజాసమస్యల పరిష్కార దిశగానే పాలన


జి.కొత్తపల్లిలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు స్వీకరించి, సత్వర పరిష్కారమే లక్ష్యంగా, ప్రజలు కోరుకున్న పాలనను అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని ఐఎస్ జగన్నాథపురం, ఐఎస్ రాఘవాపురం, జి.కొత్తపల్లి, రామసింగవరం, మద్దులగూడెం, పోతేపల్లి, గుండుగొలనుకుంట, వీకేపురం తదితర గ్రామాల్లో గ్రామదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. తొలుత గ్రామంలో జాతీయ జెండాలు పట్టుకుని భారతసైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తితో తిరంగా యాత్ర జరిపారు. నేతలు పోలిన శ్రీనివాసరావు, లంకా సత్తిపండు, జడ్పీటీసీ శామ్యూల్, రేగంటి రాంబాబు, ఏపూరి దాలయ్య, రేగంటి వెంకటేశ్వరరావు, పాతూరి సహృదయ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ పథకం పనిముట్లపై టీడీపీ విచారణ

దెందులూరు, మే 16(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వం బీసీలకు ఆదరణ పథకం ద్వారా కుల వృత్తుల ఆధారంగా పనిముట్లను మంజూరు చేసి అందిస్తున్న క్రమంలో సార్వత్రిక ఎన్నికలు వచ్చి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పనిముట్లను లబ్ధిదారులకు అందించకుండా వైసీపీ వారు కాజేశారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆరోపించి విచారణకు ఆదేశించారు. అధికారులతోపాటు టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్‌ను పార్టీ తరపున నిజనిర్ధారణ చేసేందుకు ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అప్పటి జాబితా ప్రకారం అధికారులతో కలిసి పార్టీ నాయకులు విచారణ ప్రారంభించారు. అవకతవకలు జరిగినట్టు తేలితే చట్ట ప్రకారం వైసీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకుంటామన్నారు. పెరుగుగూడెంలో మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనివాస్, పార్టీ గ్రామ అధ్యక్షుడు పావులూరి దశరథరామయ్య, పార్టీ మండల కార్యదర్శి నాగనబోయిన సత్యనారాయణ, మోతుకూరి నానిబాబు, బోడేటి మోహన్‌బాబు, గారపాటి కొండయ్య చౌదరి, యిప్పిలి వెంకటేశ్వరావు బృందం సభ్యులు విచారణ నిర్వహిస్తున్నారు.

బిలాల్ మసీదు అధ్యక్షుడిగా షేక్ యాకూబ్

జంగారెడ్డిగూడెం,మే 16 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా పనిచేసిన వారిని తెలుగుదేశం పార్టీ గుర్తిస్తుందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక బిలాల్ మసీదు కమిటీ అధ్యక్షుడిగా షేక్ యాకూబ్‌ను నియమిస్తూ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సమక్షంలో శుక్రవారం నూతన కమిటీ బాధ్యతలు చేపట్టింది. ఉపాధ్యక్షుడిగా షేక్ మస్తాన్, కార్యదర్శిగా షేక్ అల్లావుద్దీన్, సభ్యులుగా ఎండి.రఫీ, ఎస్‌కే నాగూర్ సాహెబ్, ఎస్‌కే. అమీరుద్దీన్, ఎస్.ఇస్మాయిల్, ఎస్.బషీరుద్దీన్, ఎస్‌కే ఖాసీం షరీఫ్ నియమించబడ్డారు. నూతన కమిటీని ఎమ్మెల్యే అభినందించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, టీడీపీ నాయకులు పరిమి సత్తిపండు, తూటిగుంట రాము తదితరులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలు అరికట్టడం అందరి బాధ్యత'

లింగపాలెం, మే 16(ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత అని, బాలికల రక్షణ కల్పించేదిశగా రాష్ట్రప్రభుత్వం కిశోరి వికాసం కార్యక్రమం తీసుకువచ్చిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మి అన్నారు. శుక్రవారం ముడిచర్ల అంగన్‌వాడీ కేంద్రం వద్ద కిశోరీ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీహెచ్ శ్రీకాంత్, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో పంటలకు మేలు

లింగపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు పచ్చిరొట్ట ఎరువులు ఎంతో మేలు చేస్తాయని ఏవో కోటగిరి మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం లింగపాలెంలో ఆయన మాట్లాడుతూ రైతులకు మండలంలో 22 టన్నుల పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచామని ఇంకా 15 టన్నుల వరకు తీసుకువస్తామన్నారు. పచ్చిరొట్ట ఎరువులతో పంటపొలాలలో భూసారం పెరుగుతుందని పంట దిగుబడుల పెరుగుతాయన్నారు. రైతులు తమ పంటపొలాలను వేసవిలో పొడిదుక్కులు దున్నుకోవాలని సూచించారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తోన్న కలెక్టర్, డీఎంహెచ్‌వో, తదితరులు.. పెదవేగిలో వైద్య సిబ్బంది ప్రదర్శన.. చింతలపూడిలో మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ

డెంగీపై విస్తృత అవగాహన కల్పించాలి

- కలెక్టర్ వెట్రి సెల్వి
- వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ, ప్రదర్శన

ఏలూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి):డెంగీ జ్వరం లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పల్లె ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది స్థానికులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. డెంగీ జ్వరాలపై అవగాహనకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ ముద్రించిన బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ తీవ్రజ్వరం, కండరాల నొప్పులు, కనుగుడ్ల నొప్పులు డెంగీ లక్షణాలని పేర్కొన్నారు. ప్రజలు దోమతెరలు వాడడం, ఇంటి కిటికీలు, తలుపులకు జాలీలు బిగించుకోవడం చేయాలన్నారు. డ్రెయినేజీల్లో ఆయిల్‌బాల్స్ వేయడం ద్వారా, మలాథియాన్ మందును ఫాగింగ్ చేయడం ద్వారా దోమల నిర్మూలనలకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి/పెదపాడు : డెంగీ నివారణ అందరి బాధ్యత అని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో డి.రోజ్‌మేరీ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పెదవేగిలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇంటితోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలంటూ నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. పీహెచ్‌ఎన్ నాగమణి, హెల్త్ అసిస్టెంట్లు వేణుగోపాలరావు, శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. పెదపాడు మండలం పెదపాడు పీహెచ్‌సీ పరిధిలోని వైద్యులు, వైద్యసిబ్బంది డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెదపాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు సీహెచ్ చక్రధర్, ఎం.అనంతపాల్ , ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

● చింతలపూడి : చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి నుంచి నగర పంచాయతీ, పాతబస్టాండ్ వరకు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో యర్రగుంటపల్లి వైద్యాధికారిణి డాక్టర్ గీత మాట్లాడుతూ నీరు నిల్వ లేకుండా ప్రజలు ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ర్యాలీలో రాఘవాపురం, ఎర్రగుంటపల్లి పీహెచ్‌సీల సిబ్బంది, డాక్టర్లు, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

తొమ్మిది వద్దు.. మూడు రకాల బడులే ముద్దు : డీపీఆర్టీయూ

ఏలూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ప్రారంభిస్తున్న తొమ్మిది రకాల బడులపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నందున పాత పద్ధతిలోనే మూడు రకాల బడులను కొనసాగించడానికి విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. టీచర్ల రేషనలైజేషన్, బదిలీల్లో నెలకొన్న అసంబద్ధతను తొలగించాలని, ముఖ్యంగా హైస్కూళ్లలో బోధించే స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులను ఎలిమెంటరీ స్కూళ్లకు కేటాయించడం, పలు దఫాలు రేషనలైజేషన్‌కు గురైన ఉపాధ్యాయులకు న్యాయం చేయకపోవడం ఆందోళనకు గురిచేస్తోందన్నారు. హైస్కూళ్లలో సెక్షన్‌కు 54మంది విద్యార్థులను ప్రామాణికంగా తీసుకోవడం ఉపాధ్యాయ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. అన్నిరకాల బడుల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి ఒకేలా ఉండాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తొమ్మిది రకాల బడుల విధానాన్ని వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక చేపట్టిన పోరాటానికి డీపీఆర్టీయూ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తోందని వివరించారు.

ఫుడ్ కమిటీలను ఏర్పాటు చేయాలి

కామవరపుకోట, మే 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆహారా నికి భద్రత కల్పించేందుకు ఫుడ్ అడ్వైజింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆహార సలహా సంఘాలను పునరినర్మించాలని, చౌక డిపోల ద్వారా ప్రజలకు అంద చేసే సరుకులకు సజావుగా అందేందుకు, అందులో లోటుపాట్లను ప్రభుత్వా నికి తెలియచేసేందుకు కమిటీలు ఎంతో దోహదపడతాయని చెప్పారు.

పోలసానిపల్లిలో విద్యుత్ సమస్యకు చెక్

భీమడోలు, మే 16 (ఆంధ్రజ్యోతి) : పోలసానపల్లి బీసీ కాలనీలోని 12వ వార్డులో ఓవర్ లోడు కారణంగా రెండు రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్న సందర్భంగా స్పందించిన గ్రామ సర్పంచ్ రహీమాబేగమ్ అసీనా ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు దృష్టికి తీసుకువెళ్ళారు. స్పందించిన ఎమ్మెల్యే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను, సంబంధిత స్తంబాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి గ్రామానికి విద్యుత్ సరఫరాను అందజేశారు. ఎమ్మెల్యేను గ్రామస్థులు అభినందించారు.

నేడు ఏఎంసీ చైర్మన్‌గా పార్థసారథి ప్రమాణ స్వీకారం



ఏలూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు మార్కెట్ చైర్మన్ శనివారం మామిళ్లపల్లి పార్థసారథి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు మార్కెట్ యార్డ్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 10 గంటలకు ఏఎంసీ చైర్మన్ మామిడిపల్లి పార్థసారథి ప్రమాణ స్వీకారం చేస్తారు. కార్యక్రమానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె వాయిదా

ఏలూరుకార్పొరేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఈనెల 20వ తేదీన జరగాల్సి ఉండగా వాయిదా వేశామని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. సమ్మెను అధిష్టానం వాయిదా వేసిందని పేర్కొన్నారు. ఏఐటీయూసీ నాయకులు ఉన్నారు.

ఉంగుటూరు, పెదవేగి మండలాల టీడీపీ అధ్యక్షులుగా సుధీర్, అనిల్


సుధీర్‌ను అభినందిస్తున్న గన్ని.. అనిల్‌తో చింతమనేని

ఉంగుటూరు/భీమడోలు/పెదవేగి, మే 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఉంగుటూరు మండల అధ్యక్షుడిగా మెట్ట గ్రామమైన గొల్లగూడెంకు చెందిన వేములపల్లి సుధీర్‌ను నియమించారు. భీమడోలు జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు సుధీర్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రెడ్డి సూర్యచంద్రరావు, నల్లా ఆనంద్, పాతూరి విజయకుమార్, కడియాల రవిశంకర్, ఇమ్మణ్ణి గంగాధరరావు, మండలపు సత్యనారాయణ, పసుపులేటి నరశింహారావు,పొన్నం బుజ్జి, బొమ్మిడి అప్పారావు,అల్లాడ శ్రీనివాసరావు, బండారు మధు తదితరులు పాల్గొన్నారు. అయితే పార్టీ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేసిన పాతూరి విజయకుమార్‌కు పార్టీలో సరైన గౌరవం ఇవ్వలేదని విలేకరుల సమావేశం పెట్టేందుకు సిద్ధపడగా అధిష్టానం దృష్టికి విషయం తెలపడంతో రాజధానికి రావాలని అతడికి పిలుపువచ్చింది. భవిష్యత్‌లో బాధ్యతలు పెంచుతామని హామీ ఇచ్చినట్టు తెలిసింది.

● పెదవేగి మండల అధ్యక్షుడిగా కె.కన్నాపురం గ్రామానికి చెందిన ఈడ్పుగంటి అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా రాయన్నపాలెంకు చెందిన పామర్తి నాగభూషణంతో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రకటించారు. మండల కమిటీ.. గ్రామ, బూత్ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని తెలిపారు.

వాడుకోని డబ్బులకు వడ్డీ ఎందుకు కట్టాలి ?

- బ్యాంకు అధికారుల తీరుపై డ్వాక్రా మహిళల ఆగ్రహం

బుట్టాయగూడెం, మే 16(ఆంధ్రజ్యోతి): వాడుకోని డబ్బులకు వేలకు వేల రూపాయలను వడ్డీగా ఎందుకు కట్టాలని ?.. డ్వాక్రా మహిళలు బ్యాంకు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం తమకు న్యాయం చేయాలని ఎంపీడీవో కె.జ్యోతిని వేడుకున్నారు. గాడిదబోరు గ్రామానికి చెందిన గిరిజన మహిళలు పది మంది చొప్పున ఏడు డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసుకున్నారు. ఏడు గ్రూపులకు రెడ్డిగణపవరం ఎస్‌బీఐ నుంచి ఆరు గ్రూపులకు ఒక్కో గ్రూపునకు 2001లో రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఒక్కో మహిళ రూ.రెండు లక్షల వంతున అప్పును తీరుస్తున్నారు. 2025 జనవరిలో బ్యాంకుకు వెళ్లి ఖాతాను పరిశీలించగా అందరి ఖాతాల నుంచి రూ.76 వేలు చొప్పున వడ్డీలు జమ చేసుకోవడంతో ఇదేమిటని బ్యాంక్ మేనేజర్‌ను మహిళలు నిలదీశారు. తనకు తెలియకుండానే మాపై అధికారులు మీ ఖాతాల్లో డబ్బులు జమ చేశారని అందుకే ఆరు నెలలుగా వడ్డీ రూ.76 వేల ఖాతాల నుంచి తీసుకుంటున్నామని మేనేజర్ తెలిపారన్నారు. అప్పు కావాలని తాము అగడలేదని, తమ ఖాతాల్లో రూ.లక్షలు జమచేసి వేలల్లో వడ్డీలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని ఎంపీడీవో, వెలుగు అధికారులు, సిబ్బంది దృష్టికి తెచ్చి న్యాయం చేయాలని కోరారు. ఈక్రమంలో సోమవారం బ్యాకు మేనేజర్ సమక్షంలో సమస్యను పరిష్కరిస్తానని ఎంపీడీవో తెలిపారు.


కార్యకర్తల నుంచి వినతులు స్వీకరిస్తున్న బొరగం శ్రీనివాసులు

కొయ్యలగూడెంలో 19న మినీ మహానాడు

బుట్టాయగూడెం, మే 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పండుగ ఈనెల 28న పురస్కరించుకుని మహానాడుకు సన్నద్ధంగా ఈనెల 19న కొయ్యలగూడెంలో మినీ మహానాడు నిర్వహిస్తున్నట్టు ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పార్టీ మండల అధ్యక్షులు పాల్గొని మినీ మహానాడు ఏర్పాట్లపై చర్చించినట్టు తెలిపారు. అదే రోజున మహానాడుకు వెళ్లడానికి చర్చిస్తామన్నారు. అదేరోజున కొయ్యలగూడెంలో తిరంగా యాత్రను నిర్వహించాలని కూటమి నాయకులు సమక్షంలో చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. నియోజకవర్గంలోని సమస్యలపై నాయకులు, కార్యకర్తల నుంచి గ్రీవెన్స్ నిర్వహించి వినతులు స్వీకరించినట్టు చైర్మన్ తెలిపారు. అనపర్తి వెంకటనారాయణ, మొగపర్తి సోంబాబు, పారేపల్లి నరేష్, ములిశెట్టి నాగు, శీలం వెంకటేశ్వరావు, ఉండవల్లి సోమసుందరం, నాయుడు రామకృష్ణ గౌడ్, సుంకవల్లి సాయి, కొండేపాటి రామకృష్ణ, కరాటం సాయిబాబా, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

అంబికా దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఏలూరు కార్పొరేషన్, మే16(ఆంధ్రజ్యోతి): ఏలూరులోని అంబికాదేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరం వైశాఖ బహుళ చవితి మూలా నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో సామూహికంగా రాహుకాల సమయంలో లలితా సహస్రనామ స్తోత్రాల ఆలాపన, కనకధార స్తోత్ర ఆలాపన, శ్రీసూక్త, దేవీసూక్త చండీ సప్తసతిలో విశేష శ్లోకపూర్వక సువాసిని కుంకుమార్చనలను జరిపించారు. అధికసంఖ్యలో భక్తులు కుంకుమార్చనలో పాల్గొన్నారు. తొలుత అమ్మవారిని అర్చకులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు అంబికాదేవి నామస్మరణతో ఆలయ ప్రాంతం మార్మోగింది.


అంబికాదేవి అమ్మవారు.. సౌభాగ్యలక్ష్మి ఆలయంలో మహిళల సామూహిక పూజలు

సౌభాగ్యలక్ష్మి సన్నిధిలో కుంకుమ పూజలు

విశ్వావసు నామ సంవత్సరం వైశాఖ బహుళ చవితి మూలా నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని సౌభాగ్యలక్ష్మీదేవి అమ్మవారి సన్నిధిలో ఆలయ అర్చకులు సాయి ఫణిశర్మ ముత్తైదువులతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కేజీఎన్‌వీ గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు చినబాబు, సాయి పల్లవి రామరాజు, సకలాబత్తుల పోతురాజు, ప్రవీణ్, శ్రీనివాసరావుల బృందం భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

రెండోరోజుకు గిరిజనుల దీక్షలు

బుట్టాయగూడెం, మే 16(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగ నిమాయక చట్టం చేయాలని, గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలని, ప్రత్యేక డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు చేపట్టిన రీలే నిరహార దీక్షలు శుక్రవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఆదివాసీ ఐక్యకార్యాచరణ కమిటీ పిలుపులో భాగంగా దీక్షల్లో ఏజేఏసీ, పీడీఎస్‌యూ నాయకులు తెల్లం రవిప్రసాద్, బన్నె వినోద్, రవ్వ బసవరాజు, కుంజా వెంకన్నబాబు, మడకం రమేష్, బుద్దుల నాగేంద్ర, కణితి శ్రీకాంత్, మడకం దుర్గారావు, కొమరం రాము, గోరం పెంటారావు పాల్గొన్నారు. దీక్షలకు ఐఎకేఎంఎస్, ఏటీపీ నాయకులు ధర్మాల సురేష్, తెల్లం రాములు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఏజెన్సీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు.

హెచ్ఐవీ నివారణపై కళాజాత

ఏలూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రజలకు హెచ్ఐవీ నియంత్రణ, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఐసీటీసీ సెంటర్లు ఏఆర్టీ మందులు, పీపీటీసీ కేంద్రాలు, మొబైల్ ఐసీటీసీ కేంద్రాలు, రక్తదానం హెచ్ఐవి 2017 యాక్ట్ తదితర విషయాలపై ఏలూరుకు చెందిన కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు శుక్రవారం ఏలూరు తంగెళ్ళమూడి జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద పలు చోట్ల కళాజాత, వీధి నాటిక కార్యక్రమంతో అవగాహన కల్పించారు. బృంద సభ్యులు ఎం.తిరుపతికుమార్,వి.సుబ్బారావు, ఎం.శ్రీదివ్య, వి.వాణి, వి.ప్రసాద్, ఎం.కుమార్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

కుక్కునూరు, మే 16(ఆంధ్రజ్యోతి): బర్లమడుగులో జరిగిన అగ్నిప్రమాదంలో బాధిత కుటుంబాలకు లివింగ్ శాక్రిఫైజ్ మినిస్ట్రీస్ సహకారంతో కూరగాయలు, నిత్యావసర వస్తువులు, వంటసామగ్రి, బట్టలు, దుప్పట్లు, అందజేశారు. మండల పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

లింగపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): కలరాయనగూడెంలో పేకాటాడుతున్న తొమ్మిది మంది అరెస్టు చేశామని ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారంతో దాడి చేసి వారివద్ద నుంచి రూ.14,900 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

ఏపీఆర్‌జేసీలో శృతి ప్రతిభ



ముదినేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం కాకరవాడ గ్రామానికి చెందిన కాగిత శృతి ఈ ఏడాది జరిగిన ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చింది. ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 47వ ర్యాంకు, పాలిసెట్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 590వ ర్యాంకు సాధించింది. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో కూడ శృతి 590 మార్కులు సాధించి ముదినేపల్లి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని అమ్మవారితోట, ఎంప్లాయిస్‌కాలనీ, హనుమాన్‌జంక్షన్ రోడ్డు, ఆర్.ఆర్‌పేట,చిన్నగాంధీ బొమ్మ సెంటర్, కోనేరుపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.



వింజరం, కొండంగి లాకుల వద్ద దెబ్బతిన్న షట్టరు

పంటకాలువలు అస్తవ్యస్తం

కైకలూరు (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లల్లో పంటకాలువలు ఆధునికీకరణ చేయకపోవడంతో అస్తవ్యస్థంగా మారాయి. కైకలూరు నియోజకవర్గంలో ప్రధానంగా పోల్‌రాజ్ కాలువ, క్యాంప్‌బెల్ కెనాల్ ద్వారానే తాగు, సాగునీరు చేరాలి. ఈ రెండు కాలువల నుంచి అనేక చిన్నపాటి కాలువలు అనేక గ్రామాలను అనుసంధానం చేసుకుంటూ ఉప్పుటేరులోనికి చేరు తుంటాయి. పోల్‌రాజ్ కాలువలో కైకలూరు మండలం వింజరం వద్ద బ్రిటిష్ కాలంలో ఏర్పాటుచేసిన లాకులు దెబ్బ తినడంతో కొద్దిపాటి మరమ్మతులు నిర్వహించి నీటిని నిలుపు దల చేసేందుకు అధికారులు ప్రయ త్నిస్తున్నారు. వింజరం నుంచి నరసాయిపాలెంకు వెళ్లే షట్టర్లు పూర్తిగా ధ్వంసమయ్యా యి. పెద్దపెద్ద కానాలు ఉండడంతో నీటిని అదుపు చేయడం అధికారులకు కష్టతరంగా మారింది. సీతనపల్లి, గోపవరం వెళ్లే పంటకాలవలకు షట్టర్లు లేవు. ముదినేపల్లి మండలంలో పోల్ రాజ్ పంటకాలువ నుంచి చిన్న అన్నవరం బ్రాంచి కాలువ రిటైనింగ్‌వాల్ ధ్వంసమై సంవత్సరాలు గడుస్తుంది. వడాలి సమీపంలో పైపుకల్వర్టు వద్ద పోల్ రాజ్‌కు రెండు వైపులా నిర్మాణం చేసిన రిటైనింగ్‌వాల్ బీటలు వారి కూలిపోయింది. పెరికేగూడెం, పెయ్యేరు, కొర గుంటపాలెం గ్రామాల్లోని కాలువ షట్టర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కలిదిండి మండలంలోని క్యాంప్‌బెల్ కెనాల్‌కు కోరుకొల్లు లాకులు పైన అనేక చోట్ల పంట కాలువగట్లు ధ్వంసమయ్యాయి. కొండంగి, పెదలంక వెళ్లే పంట కాలువలకు షట్టర్లు లేవు. ఈ షట్టర్ల నిర్మాణానికి జలవనరులశాఖ అధికారులు రూ.2 కోట్ల వ్యయంతో, క్యాంప్‌బెల్ కెనాల్‌కు కోరుకొల్లు లాకుల పైనుంచి గుడ్లవల్లేరు వరకు అనేకచోట్ల గట్లు పటిష్టం చేసేందుకు రూ.90 లక్షల వ్యయంతో ప్రతిపాదనలు అందజేశారు.



గురజ.. కలిదిండి.. సగ్గూరులలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డెంగీపై అవగాహన ర్యాలీలు

డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా అంతటా వైద్య సిబ్బంది అవగాహనా ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. ముఖ్యంగా దోమలు నివారణ, పరిసరాలు పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ముదినేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగీ వ్యా. ది దినోత్సవం సందర్భంగా శుక్రవారం ముదినేపల్లి మండలం గురజలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్.స్వాతి ఆధ్వర్యంలో వైద్యశాఖ అధికారులు, సిబ్బంది డెంగీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమకాటు నుంచి రక్షణ పొందేందుకు దోమ తెరలు ఉండాలని, ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ జోనాతన్, హెల్త్ సూపర్‌వైజర్ రహీం, ఆశా వర్కర్లు, గ్రామస్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

కలిదిండి: డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్ అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా కలిదిండిలో వైద్యాధికారులు, ఆశా వర్కర్లు డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు, మస్కిట్ కాయిల్స్‌ను వాడాలన్నారు. డెంగీ లక్షణాలు కనిపించిన వెంటనే పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ముసునూరు: రమణక్కపేట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కరిముల్లా ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శక్రవారం అవగహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ డెంగీ జర్వం చాలా ప్రమాదకరమైందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం డెంగీ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారిణిలు డా.మంజుల దేవి, డా.సంధ్యా ప్రియదర్శిని ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ఇంటర్వ్యూ..

ఉపాధిపనులపై ప్రత్యేక దృష్టి

వై రామకృష్ణ, ఎంపీడీవో, ముదినేపల్లి



- **ఉపాధి పనుల ప్రణాళిక ముదినేపల్లి మండలంలో ఖరారైందా?**

జవాబు: తొలి ప్రణాళికలో ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

- **గత ఏడాది 3.12 లక్షల పని దినాలు లక్ష్యం కదా?**

జవాబు : పనులు పెరిగేదాన్ని బట్టి పని దినాలు పెరుగుతాయి. మరో లక్ష పని దినాలతో త్వరలో పూర్తిస్థాయిలో ప్రణాళికను రూపొందిస్తాం.

- **మండలంలో ఏయే పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు?**

జవాబు : వ్యవసాయ సీజను వస్తుంది కాబట్టి ముందుగా రైతులకు ఉపకరించే పంట, మురుగు కాల్వల తవ్వకాల పనులు నిర్వహిస్తున్నాం.

- **మండలంలో పశువులకు తాగునీటి తొట్టెల నిర్మాణం పూర్తి చేస్తారా?**

జవాబు: కొన్ని తొట్టెల నిర్మాణం జరుగుతున్నాయి. నాలుగైదు రోజుల్లో నూరు శాతం పూర్తి చేస్తాం.

- **ఉపాధి కూలీలకు వేతనాలు సకాలంలో అందుతున్నాయా?**

జవాబు : పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి బిల్లులు పంపించేస్తున్నాం. కూలీల బ్యాంక్ అకౌంట్లలోనే వేతనాలు జమ అవుతాయి.

- ముదినేపల్లి, ఆంధ్రజ్యోతి

యువకులకు క్రికెట్ కిట్లు వితరణ

చాట్రాయి, మే 16(ఆంధ్రజ్యోతి): జనార్దనవరం తూర్పు దళితవాడ టీడీపీ కార్యకర్తలు విజ్ఞప్తి మేరకు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మాదాసు చిన్న పుల్లయ్య, తెలుగు మహిళ నాయకురాలు చంద్రకళ దంపతులు శుక్రవారం యువకులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగరాజు, వెంగళరావు, రత్తయ్య, పౌలు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కౌలు రైతు గుర్తింపు కార్డులకు భూ యజమాని అంగీకారం తప్పనిసరి

ముదినేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల గుర్తింపు కార్డులు పొందేందుకు భూమి యజమానుల అంగీకార పత్రం తప్పనిసరి అని ముదినేపల్లి మండల వ్యవసాయ శాఖాధికారి బి.వేణుమాధవ్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులకు కౌలు రైతుల గుర్తింపు కార్డుల మంజూరుపై వ్యవసాయ శాఖ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ భూ యజమానుల అంగీకారంతోనే కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కౌలు రైతు 11 నెలల కాలపరిమితితో పొందే ఈ గుర్తింపు కార్డు వల్ల భూ యజమానుల హక్కులకు ఎటువంటి నష్టం వాటిల్లదని తెలిపారు. కౌలు రైతులు తమ ఆధార్ కార్డులు ఫొటోస్టాట్ కాపీతో పాటు, పాస్ పోర్టు సైజుఫొటో, సాగు చేస్తున్న భూ యజమాని పొలం పట్టాదార్ పాస్ బుక్ ఫొటో స్టాట్ కాపీని వీఆర్వో గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేయాలని తెలిపారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు ఉంటేనే ప్రభుత్వం అందించే ప్రయోజనాలు, పంట రుణాలు, పంట నష్ట పరిహారం పొందేందుకు అకాశం ఉంటుందని ఏవో వివరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

రేపు చనుబండలో రక్తదాన శిబిరం

చాట్రాయి, మే 16(ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఎన్టీఆర్ ఫౌండేషన్(రా) ఆధ్వర్యంలో 18వ తేదీన చనుబండలో తలసేమియా పిల్లల కోసం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ఇన్‌చార్జి మిద్దె అఖిల్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు రామాలయం వద్ద శిబిరం ప్రారంభం అవుతుందని రక్తదాతలు, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని జయప్రదం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

ఆటో డ్రైవర్‌కు అండగా ఉంటానంటూ మంత్రి భరోసా



బాధితులతో మాట్లాడుతున్న మంత్రి సారథి

నూజివీడు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. చాట్రాయి ప్రజాదర్బార్ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా పోతురెడ్డిపల్లి అడ్డరోడ్డు వద్ద ప్రమాదానికి గురైన ఆటో, లారీలను చూసి కాన్వాయ్‌ని ఆపి ప్రమాద కారణాలను బాధితుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో పోతురెడ్డిపల్లికి చెందిన భాస్కర్ ఆటో పూర్తిగా ధ్వంసం కాగా ఆటోడ్రైవర్‌కు ధైర్యం చెప్పి అతని జీవనోపాధికి అండగా నిలుస్తామని, ప్రభుత్వం తరఫున నూతన ఆటో ఇప్పించే బాధ్యత తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అక్కినేని చందు తదితరులు పాల్గొన్నారు.

రమణక్కపేట విద్యార్థుల ప్రతిభ



రమణక్కపేట విద్యార్థులతో పీడీ నాగరాజు

ముసునూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): అంతర జిల్లాల రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో రమణక్కపేట విద్యార్థులు ప్రతిభను చూపుతూ కృష్ణా జిల్లా జట్టు విజయంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ వాకా నాగరాజు తెలిపారు. గత నెల 20వ తేదీన నూజివీడు పట్టణంలో వీటీహెచ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా సబ్ జూనియర్ (అండర్-14) జట్టుకు ఎంపికైనట్లు పీడీ తెలిపారు. అయితే ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు చిత్తూరు జిల్లాలో జరుగుతున్న అంతర జిల్లాల రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో జి.జస్సీ, పి.బ్లెస్సీ, కె.హర్షిత, డి.ఇందు ప్రియలు చూపిన ప్రతిభతో గుంటూరు జిల్లా బాలికల జట్టుపై 26-16 స్కోరుతో అద్భుత విజయాన్ని కృష్ణాజిల్లా జట్టుకు అందించారని నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా బాలికలను రమణక్కపేట జడ్పీపాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయు సిబ్బంది శుక్రవారం అభినందించారు.

నూజివీడులో 28.8మిల్లీమీటర్ల వర్షపాతం

నూజివీడు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలో గురువారం అర్ధరాత్రి నుంచి బారీవర్షం నమోదైంది. నియోజకవర్గ కేంద్రమైన నూజివీడులో 28.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా అత్యధికంగా చాట్రాయిలో 42.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆగిరిపల్లిలో 26.6, ముసునూరు మండలంలో అత్యల్పంగా 6.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

విద్యుత్ కోతలతో సతమతం

ముసునూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ముసునూరు గ్రామం పేరుకే మండల కేంద్రం. నిత్యం గంటల తరబడి విద్యుత్ కోతలు. దీంతో ప్రజలు, చేతిపనివారు, అధికారులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని 16 గ్రామాల్లో లేని విద్యుత్ కోతలు ఒక్క ముసునూరులోనే ఉండటంపై ట్రాన్స్‌కో అధికారుల పనితీరుపై స్థానికులు మండిపడుతున్నారు. ప్రతిరోజు ఉదయం వ్యవసాయ విద్యుత్‌లో రెండు గంటలు, సాయంత్రం మరమ్మతుల పేరుతో మరో రెండు నుంచి మూడు గంటలు విద్యుత్‌ను నిలిపేస్తున్నారు. పక్క గ్రామాల్లో మాత్రం విద్యుత్ సరఫరా సక్రమంగా ఉంటుందని, ఆ గ్రామాలకు లేని కోతలు ముసునూరు ఒక్క గ్రామానికే ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడూ కరెంట్ ఉంటుందో ఉండదో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

చాట్రాయి తహసీల్దార్‌గా ఈశ్వరరావు



చాట్రాయి, మే 16(ఆంధ్రజ్యోతి): చాట్రాయి తహసీల్దార్(ఎఫ్ఏసీ)గా ఈశ్వరరావును నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయటంతో శుక్రవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈశ్వరరావు ఇదే కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న డి ప్రశాంతిని అవినీతి ఆరోపణలపై ఈ ఏడాది మార్చి 12న కలెక్టర్ సెస్పెండ్ చేశారు. మండల రీసర్వే డీటీ గీతను తహసీల్దార్(ఎఫ్ఏసి)గా నియమించగా ఆమె ఇప్పటి వరకు కొనసాగారు.

16 మంది ఎక్సైజ్ నేరస్థుల బైండోవర్

చాట్రాయి, మే 16(ఆంధ్రజ్యోతి): 16 మంది ఎక్సైజ్ పాత నేరస్థులను తహసీల్దార్ ఈశ్వరరావు ఎదుట హాజరుపర్చి బైండోవర్ చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. ఈ సందర్భంగా నిందితులతో తహసీల్దార్ మాట్లాడుతూ బైండోవర్ కాల పరిమితి ఏడాది ఉంటుందని ఈలోగా నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానాతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని హెచ్చరించారు.

పోతనపల్లిలో బెల్లం ఊట ధ్వంసం

ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం పోతనపల్లి పెద్ద తండాలో దాడి జరిపి ధారవతు మంగమ్మ ఇంటిలో నిల్వ ఉంచిన 100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి ఆమెపై కేసు నమోదు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు



అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించిన మసీద్ కమిటీ సభ్యులు

ముస్లిం విద్యార్థులకు నగదు బహుమతులు

ఆగిరిపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లిలోని 2025వ సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో 500 పైగా మార్కులు సాధించిన ముస్లిం విద్యార్థులకు మక్కా మసీదు తరపున ఒక్కొక్కరికి రూ.500 నగదు, మెమెంటో అందజేసినట్టు మక్కా మసీదు సెక్రటరీ షేక్ అబ్దుల్ హక్ తెలిపారు. షేక్ నాజియా (583), షేక్ సోహెల్ (562), షేక్ గుల్జార్ (541), షేక్ జాహెద్ (540) మార్కులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ సుబానీ, షేక్ రంజానీ, స్కూల్ టీచర్ షేక్ అల్లా బక్ష, షేక్ జానీ, షేక్ భాష, షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎయిడ్స్ పై అవగాహన కల్పిస్తున్న కళాకారుల బృందం

ఎయిడ్స్‌పై అవగాహన

ఆగిరిపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కళాజాత బృందాలతో వీధి నాటకాలు ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆగిరిపల్లి గ్రామంలోని కల్యాణ మండపం వద్ద వీధి నాటకం ద్వారా హెచ్ఐవీ వ్యాధి ఎలా వ్యాపించదు, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఉండాలంటూ వీధి నాటకం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు.



పచ్చిరొట్ట విత్తనాల కిట్లు తయారు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

రైతులకు పచ్చిరొట్ట విత్తనాల కిట్లు

చాట్రాయి, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాల కిట్లు పంపిణీకి సిద్ధం చేసినట్లు ఆ శాఖ అధికారులు కాంతం, రాము తెలిపారు. చాట్రాయిలో శుక్రవారం 22 రకాల పచ్చిరొట్ట విత్తనాలు కలిపి ఎకరానికి 10 కేజీలు చొప్పున 250 కిట్లు తయారు చేశారు. ఆసక్తి కలిగిన రైతులకు ఒక్కో కిట్టు రూ.1000కు అందజేస్తామని, ఈ విత్తనాలు భూమిలో చల్లి 45 రోజుల తరువాత కలియదున్నటం వలన భూమికి పోషకాలు అందుతాయని తెలిపారు. ఈ విత్తనాలు సాగు వలన భూమి సారవంతమై నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఏ రాంబాబు, శ్రీనివాసరావు, చక్రధరరావు, వీరభద్రరావు పాల్గొన్నారు.

రేపు చాట్రాయిలో తిరంగా రన్ ర్యాలీ

చాట్రాయి, మే 16(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు గట్టి గుణపాఠం చెప్పిన భారత త్రివిధ దళాలకు, ప్రధాని మోదీకి సంఘీభావంగా చాట్రాయిలో 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు తిరంగా రన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో చాట్రాయి వికాస్ కాలేజి వద్ద తిరంగా రన్ ర్యాలీ ప్రారంభం అయ్యి ఆర్సీఎం చర్చి వరకు సాగుతుందని తెలిపారు. మండల స్థాయి అధికారులు సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.



భరత నాట్య చిన్నారులకు సత్కారం

ముదినేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలోని సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం రాత్రి జరిగిన కూచిపూడి భరత నాట్యం, జానపద నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ నాట్య ప్రదర్శనను నిర్వహించిన గుడివాడ, వడాలికి చెందిన చిన్నారులను దేవస్థానం తరఫున ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు సత్కరించారు. నాట్య బృందం నిర్వాహకుడు మరీదు శ్రీనివాసరావును కూడ సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో చేపల ప్యాకింగ్ కూలీ మృతి

మండవల్లి మే 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో చేపల ప్యాకింగ్ కూలీ మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. ఏలూరులో చేపల ప్యాకింగ్ పని చేసుకుని ద్విచక్రవాహనంపై ఇంటి రాంబాబు, ముత్యాల లాజర్ కైకలూరు వైపు వస్తున్నారు. మార్గమధ్యలో మణుగులూరు వద్ద కైకలూరు నుంచి ఏలూరు వెళుతున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మండలంలోని లోకుముడి గ్రామానికి చెందిన ఇంటి రాంబాబు(40) అక్కడికక్కడే మృతి చెందగా మరో చేపలప్యాకింగ్ కూలీ ముత్యాల లాజర్ తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మండవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పెంచికలమర్రులో సమావేశమైన కిశోరబాలికలు, అంగన్వాడీ, ఆశావర్కర్లు

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కైకలూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు సోషల్‌మీడియా, అపరిచిత వ్యక్తుల పరిచయాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీదాఖానం అన్నారు. శుక్రవారం పెంచికలమర్రు పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తూ సోషల్‌మీడియా, సైబర్ నేరస్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మహిళలు చట్టాలపై అవగాహన కల్గియుండాలని, బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సూచించారు. అనంతరం గ్రామంలో బాల్యవివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం మోషే, ఏఎన్‌ఎం రజని, సచివాలయ సిబ్బంది శ్రీరామ్, సుగుణ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

అకాల వర్షంతో ఆక్వా రైతుల అవస్థలు



కలిదిండి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం అకాల వర్షం కురవటంతో ఆక్వా రైతులు అవస్థలు పడుతున్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షం దెబ్బకి పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో చెరువుల్లో తిరుగుతున్న ఏరియేటర్లు నిలిచిపోవటంతో చెరువుల్లో ఆక్సిజన్ లోపించి చేపలు, రొయ్యలు నీటిపై తేలియాడుతూ కొన ఊపిరితో ఉంటున్నాయని ఏ క్షణంలో చనిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. కలిదిండి, కైకలూరు, భీమవరం ఆక్వా మందు షాపుల్లో ఖరీదైన మందులు కొనుగోలు చేసి చేపల, రొయ్యల చెరువుల్లో చల్లుతున్నారు.

జనరేటర్లకు పెరిగిన డిమాండ్

అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండటంతో పాటు ఈదురుగాలులతో కూడిన వర్షా లు కురు స్తుండటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో అద్దె జనరేటర్లకు డిమాండ్ పెరిగింది. రోజుల వారీగానూ, నెలల వారీగానూ జనరేటర్లను అద్దెకు తెచ్చుకుని చెరువుల్లో ఏరియేటర్లు తిప్పుతున్నారు. దీంతో రైతులకు అదనపు ఆర్థిక భారమవుతున్నది. కొంతమంది రైతులు బోటుపై ఆయిలింజన్ ఏర్పాటు చేసి ఆక్సిజన్ కోసం చెరువుల్లో తిప్పుతూ నీటిని రీ సైక్లింగ్ చేస్తున్నారు.

బొమ్మినంపాడు పంచాయతీలో డీఎల్‌పీవో విచారణ



బొమ్మినంపాడులో విచారణ జరుపుతున్న డీఎల్‌పీవో చంద్రశేఖర్

ముదినేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామపంచాయతీలో పరిపాలనాపరమైన, ఆర్థిక పరమైన అంశాలపై వస్తున్న ఫిర్యాదులు, పంచాయతీ నిధుల వినియోగం, సర్పంచ్‌కి, కార్యదర్శికి మధ్య తలెత్తిన విబేధాలు తదితర అంశాలపై శుక్రవారం ఏలూరు డీఎల్‌పీవో కె.పూర్ణ చంద్రశేఖర్ విచారణ జరిపారు. తనను పంచాయతీ కార్యదర్శి ఇబ్బందులు పెడుతున్నారని, తనకు కనీస మర్యాద ఇవ్వడం లేదని, పనుల నిర్వహణలో ఎటు వంటి సహకారం అందించడం లేదని సర్పంచ్ దారం సుధ ఇటీవల స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాగా పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగిందని, పనులకు సంబంధించిన రికార్డులను సర్పంచ్ చూపించడం లేదని ఉప సర్పంచ్ పాలంకి వెంకటేశ్వరరావు గురువారం ముదినేపల్లిలో జిల్లా పంచాయతీ అధికారి అనూరాధకు ఫిర్యాదు చేశారు. అలాగే తన వద్ద తీసుకున్న ఎంబుక్, పనులకు సంబంధించిన ఫైలు, సర్పంచ్ తిరిగి తనకు ఇవ్వడం లేదని కార్యదర్శి శ్రీనివాసు పంచాయతీశాఖ అధికారులకు చేసిన ఫిర్యాదులపై డీఎల్‌పీవో ఈ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావుతో పాటు కొంతమంది సభ్యులు పంచాయతీల్లో రూ.7 లక్షల నిధుల వినియోగానికి సంబంధించి సర్పంచ్ లెక్కలు చెప్పడంలేదని, రికార్డులు చూపడంలేదని, మట్టి పనుల పేరుతో సర్పంచ్, బదిలీ అయిన కార్యదర్శి బిల్లులు చేశారని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుధ మాట్లాడుతూ తనపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, పంచాయతీ కార్యదర్శి నుంచి తాను ఎం బుక్, ఇతర ఫైళ్ళు తీసుకోలేదని తెలిపారు. తాను చేసిన పనులకు సంబంధించి ఇంకా బిల్లులు రావాల్సి ఉందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తన స్టేట్‌మెంట్‌లో పనులకు సంబంధించిన ఎంబుక్, ఫైల్ సర్పంచ్ వద్దే ఉందని పేర్కొన్నారు. దీనిపై తుది నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని డీఎల్‌పీవో తెలిపారు.

22 మందికి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చాట్రాయి, మే 16(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలానికి చెందిన 22 మంది లబ్ధిదారులకు రూ.7 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రాణాపాయ పరిస్థితిలో ఉంటే వైద్యం కోసం నేరుగా తనతో మాట్లాడితే మెరుగైన వైద్య సేవలు అందటానికి సత్వర చర్యలు తీసుకుంటానని అన్నారు

